
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States



CORPORATE COMMERCE
College for Practical Exposure
MEC / CEC
B.Com / BBA
Coming soon @ Ameerpet
Beside Sarathi Studios

CA. China Masthan T
www.corporatecommerce.in
94188 66666



సంపుటి : 24 | సంచిక : 37 | ది. 5-4-2025 | విజయవాడ | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


# ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి

● అవసరాని బట్టి పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో వర్చువల్ వైద్యసేవలు ● వైద్యారోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 పడకల నుంచి 300 పడకల సామర్థ్యంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు స్థాపించేలా కార్యాచరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మొత్తం 175 నియోజకవర్గాలకు గాను 100 పడకలకు పైగా సామర్థ్యం ఉన్న ఆస్పత్రులు ఇప్పటికే 70 వరకు ఉన్నాయని, మిగిలిన 105 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్ నిర్మాణం జరిగేలా త్వరితిగతిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీపీపీ పద్ధతిలో ఆస్పత్రులు నిర్మించి, నిర్వహించేలా ఆలోచన చేయాలని, ఇందుకోసం ముందుకొచ్చే సంస్థలకు పరిశ్రమల తరహాలోనే సబ్సిడీలు ఇచ్చే విధానం రూపొందించాలని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తృత పరచాలని చెప్పారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం అమరావతి వచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని చెప్పారు.

**వర్చువల్ వైద్య సేవలు :** విద్య-వైద్య రంగాలు తమ ప్రాధామ్యాలుగా చెప్పిన ముఖ్యమంత్రి...గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులకు చెప్పారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలో వైద్యులు అందుబాటులో లేని సమయంలో రోగులకు వర్చువల్ విధానంలో ప్రాథమిక సేవలు అందేలా చూడాలన్నారు. అన్యారోగ్యం బారిన పడిన తర్వాత వైద్యసేవలు అందించే పరిస్థితి నుంచి... ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆహారపు అలవాట్లను, జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా హైపర్ టెన్షన్, దయాబెటిస్ వంటి వ్యాధుల నుంచి చాలావరకు బయటపడవచ్చన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు.

**కొత్తగా 13 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లు :** రూ.32.5 కోట్లతో 25 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను బలోపేతం చేయడంతో పాటు, కొత్తగా మరో 13 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సమావేశంలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే ఏజెన్సీ ఏరియాలోని పీహెచ్‌సీల్లో వైద్య ఖాళీల భర్తీ, విజయనగరంలో కొత్తగా 8 దయాలసిస్ సెంటర్ల ఏర్పాటు, ఎన్టీఆర్, విజయనగరం, బాపట్ల జిల్లాల్లో దయాలసిస్ మెషిన్లు పెంచడం, కొవ్వూరు-నిడదవోలు సీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేయడం తదితర అంశాలపైన మార్గదర్శకాలు జారీ చేశారు.

**కుప్పంలో డిజిటల్ నెర్వ్ సెంటర్ :** కుప్పంలో అమలు చేస్తున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అభివృద్ధి చేసిన వినూత్న ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం డిజిటల్ నెర్వ్ సెంటర్ (DiNC) పురోగతి గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి ఆరోగ్య సంరక్షణ అందించడానికి డిజిటల్ నెర్వ్ సెంటర్ దోహదపడుతుంది. దేశంలోనే అత్యధికంగా 4.47 కోట్ల (88 శాతం) మందికి రాష్ట్రంలో అభా కార్డులు జారీ అయ్యాయి. అలాగే, పీఎం జన్మాన్‌లో భాగంగా టీబీ ఎలిమినేషన్ కింద 82,693 గిరిజనులకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ చేయగా 5,072 మందికి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 10,11,461 మంది గిరిజనులకు స్క్రీనింగ్ చేయగా 1,977 మందికి సికిల్ సెల్ ఎనీమియా పాజిటివ్‌గా తేలింది. రాష్ట్రంలో 95.60 శాతం జనన, మరణాల నమోదు జరిగింది. 13,26,621 శిశు ఆధార్‌లు జారీ అయ్యాయి.

# భారత ప్రధాన న్యాయమూర్తి రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటనకు రాక

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** గౌరవ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా మరియు గౌరవ ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ ఈనెల 5, 6 తేదీలలో రెండు రోజులు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈనెల 5న మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకొని తిరుపతి నందు స్వల్ప విశ్రాంతి అనంతరం రాత్రి 8 గంటలకు తిరుమల చేరుకుని రాత్రి బస చేస్తారని, మరుసటి రోజు 06 వ తేదీ ఉదయం సుప్రభాత సేవలో తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని, మధ్యాహ్నం 2.35 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుండి ఢిల్లీ తిరుగు ప్రయాణం కానున్నారని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ ఈనెల 5న ఉదయం 10.10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుని రాత్రికి తిరుమలలో బస చేస్తారని, 06 వ తేదీ ఉదయం సుప్రభాత సేవలో తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్పీ హర్ష వర్ధన్ రాజు తో కలిసి కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నందు అధికారులకు సూచిస్తూ ప్రోటోకాల్, బందోబస్తు, కాన్వాయ్ ఏర్పాట్లు అన్నీ పక్కాగా ఉండాలని ఆదేశించారు.

# ఏపీలో నామినేటెడ్ పదవుల పండగ



**అమరావతి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఏపీలో నామినేటెడ్ పదవుల కేటాయింపు కొనసాగుతోంది. అందులోభాగంగా 38 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల పేర్లను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఈ ఏఎంసీ ఛైర్మన్ పదవుల్లో 31 టీడీపీ, 6 జనసేన, 1 బీజేపీ నేతలకు కేటాయించిందీ ప్రభుత్వం. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీల ఛైర్మన్లను ప్రకటిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అందుకోసం కసరత్తు జరుగుతోందని పేర్కొంది. 2024 మే, జూన్ మాసాల్లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ఓటరు కూటమికి పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పోటీ చేశాయి. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటులో భాగంగా పలువురు సీనియర్లు ఎన్నిక వేళ.. సీట్లు వదులు కోవాల్సి వచ్చింది. అధికారంలోకి వచ్చిన అనంతరం నామినేటెడ్ పోస్టులు కట్టబెడతామంటూ వారికి హామీ సైతం ఇచ్చారు. ఇక సదరు ఎన్నికల్లో కూటమిలోని పార్టీలు మొత్తం 175కి 164 స్థానాలకు గెలుచుకున్నాయి. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా పలువురు సీనియర్ నేతలకు ఇప్పటికే విడతల వారిగా కీలక పోస్టులు కేటాయించింది. ఈ కేటాయింపుల్లో సైతం మిత్ర ధర్మం పాటిస్తూ చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఆ క్రమంలో ఏఎంసీ ఛైర్మన్ల పేర్లను ప్రకటించారు. మిగతా వారి పేర్లను సైతం మరికొద్ది రోజుల్లో ప్రకటించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# సచివాలయంలో అన్ని చోట్ల భద్రత పరమైన చర్యలు తీసుకోండి: సీఎం

● సచివాలయంలో అగ్నిప్రమాద ప్రదేశాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు



**అమరావతి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** వెలగపూడి సచివాలయంలోని రెండవ బ్లాక్‌లో తెల్లవారుజామున చోటు చేసుకున్న అగ్నిప్రమాద ప్రదేశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు. సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, హోంమంత్రి అనిత, జీఏడీ పొలిటకల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనాతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందని, ఏ సమయంలో చోటు చేసుకుందని సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రతిచోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రమాదానికి గల కారణాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్ బృందం ఎన్ని గంటలకు వచ్చిందని అడిగారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అవసరమైన ఆధారాలను సేకరించిందీ లేనిది అడిగారు. సచివాలయంలో అన్ని చోట్లా భద్రతా ప్రమాణాలన్నీ పాటిస్తున్నారా లేదా అన్నది ఆడిట్ చేయాలని సూచించారు. అనంతరం మొదటి బ్లాక్‌లోని బ్యాటరీ రూమ్‌ను కూడా సీఎం పరిశీలించారు. ఇటువంటి బ్యాటరీ గ్యాలరీనే రెండవ బ్లాక్‌లో అగ్నిప్రమాదానికి గురైందని సీఎంకు సీఎస్ వివరించారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ విభాగాన్ని పరిశీలించారు. అక్కడి అపరిశుభ్రతపై అసంతృప్తిని వ్యక్తం చేసిన సీఎం, 24 గంటల్లో చెత్తనంతా క్లీన్ చేయాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో ఎక్కడా తాత్కాలికంగా కూడా చెత్త కనబడటానికి వీల్లేదని అన్నారు.

# పేదల ఇళ్ల నిర్మాణాల్లో కోట్లు దోచుకున్న ఏ ఒక్కరిని వదిలిపెట్టం

● జిల్లాలో రూ.120 కోట్లు కాజేశారని విజిలెన్స్ విచారణలో తేలింది ● అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం ● కాంట్రాక్టర్ల ఆస్తుల నుంచి రికవరీ చేసైనా పేదల ఇళ్లు నిర్మిస్తాం ● రాష్ట్రవ్యాప్తంలో పేదలకు 10లక్షల ఇళ్లు నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం ● సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నాం ● మే, జూన్ నెలల్లో తల్లికివందనం, అన్నదాత సుఖీభవ ● రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ● వరిగొండ, పొదలకూరులో హౌసింగ్ లేఅవుట్లను పరిశీలించిన మంత్రి





**నెల్లూరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన పేదల ఇళ్ల నిర్మాణాల్లో కోట్లాది రూపాయలు దోచుకున్న ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. శుక్రవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి తోటపల్లి గూడూరు మండలం వరిగొండలో, పొదలకూరు సమీపంలోని చిట్టేపల్లి తిప్ప వద్ద హౌసింగ్ లేఅవుట్లను మంత్రి పార్థసారథి, గృహనిర్మాణశాఖ ఎండి రాజబాబు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడి పలు సమస్యలను తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి తాము నష్టపోయామని, తమ అకౌంట్లో పడిన డబ్బులను కూడా సంతకాలు పెట్టించుకుని తీసుకున్నారని... పనిచేయకుండానే బిల్లులు పెట్టి డబ్బులు కాజేశారని, ల్యాండ్ లెవెలింగ్ పేరుతో కోట్ల రూపాయలు కాజేశారని, స్టీలు, సిమెంటు, కిటికీలు, తలుపులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని, తమకు ఇల్లు కట్టించకుండా అన్నివిధాలుగా మోసం చేశారని మంత్రి ఎదుట పలువురు లబ్ధిదారులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గృహ నిర్మాణ పథకాన్ని అభాసుపాలు చేసిందన్నారు. నెల్లూరు జిల్లాలో మంత్రులు, స్థానిక శాసనసభ్యుల ఫిర్యాదుల మేరకు గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ ఎంక్వయిరీ వేసాం... ఈ ఎంక్వయిరీ లో 120 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు గుర్తించినట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో కోట్లాది రూపాయల దోచుకున్న ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాలను నాసిరకంగా నిర్మించి, నిరుపేదలు, అమాయకులైన గిరిజనులను మోసం చేసి దోచుకున్న కాంట్రాక్టర్లు, గత ప్రభుత్వ నాయకులపై క్రిమినల్ కేసులు పెట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే చాలామంది కాంట్రాక్టర్లపై కోర్టుల్లో కేసులు వేసామని చెప్పారు. రెవిన్యూ రికవరి యాక్ట్ ప్రకారం దోచుకున్న డబ్బును తిరిగి రికవరీ చేసి, పేదలకు నాణ్యత గల ఇల్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ 2.50 లక్షలు పేదల ఇళ్లకు మంజూరు చేసి పెద్ద ఎత్తున ఎన్టీఆర్ గృహనిర్మాలను నిర్మించినట్లు చెప్పారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 1.80 లక్షల నిధులను మాత్రమే ఖర్చు చేసి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని చెప్పారు. హౌసింగ్ పథకాన్ని ఒక దోపిడీ పథకంగా మార్చేశారని, పేదల కడుపు కొట్టారని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. గత ప్రభుత్వ అవినీతిలో హౌసింగ్ అధికారుల పాత్ర కూడా ఉందని, వారిపై కూడా విచారించి కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఒక ఇంజనీరింగ్ ఏజెన్సీ ద్వారా అన్ని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల నాణ్యత ప్రమాణాలను అంచనా వేయించి, ఆ సంస్థ నివేదిక మేరకు నాణ్యత గల నిర్మాణాలు ఉంటే కొనసాగిస్తామని, లేకుంటే బేస్మెంట్లను పగలగొట్టి మళ్లీ నాణ్యత ప్రమాణాలతో పేదలకు ఇళ్ళను నిర్మించి ఇస్తామని చెప్పారు. గత ప్రభుత్వ నాయకులు నిరుపేదలైన అమాయకులను దోచుకోవడం చాలా దారుణమని దౌర్భాగ్యమని, ఇంతకంటే నీచమైనది ఏదీ లేదన్నారు. అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్లు స్వచ్ఛందంగా తమ తప్పులను ఒప్పుకుని నాణ్యతగా ఇళ్లను నిర్మించేందుకు ముందుకు వస్తే

- 8లో

# తిరుమల దేవస్థానం విషయంలో శ్రీనివాస దీక్షితులకి షాక్



**అమరావతి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** తిరుమల తిరుపతి దేవస్థానానికి ఏపీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయ ప్రధాన అర్చక పదవి నుంచి తనను తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులుగా బదిలీ చెయ్యాలంటూ పెద్దింటి కుటుంబానికి చెందిన శ్రీనివాస దీక్షితులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరుగగా.. శ్రీనివాస దీక్షితుల పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. పరిపాలన పరమైన అంశాల్లో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఉద్యోగిగా టీటీడీ ఎక్కడ విధులు కేటాయిస్తే అక్కడ విధులు నిర్వర్తించాలని పిటిషనర్‌ను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది.

# వాసుదేవరెడ్డిని పంపేశారు - మొత్తం లెక్క తేలిందా ?



**అమరావతి, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఏపీ లిక్కర్ స్కాంలో అత్యంత కీలక వ్యక్తిగా సీఐడీ అధికారులు భావిస్తున్న ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డిని మాతృశాఖకు వెళ్లేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఆయనను రిలీవ్ చేశారు. ఆయనను ఇప్పటి వరకూ అరెస్టు చేయలేదు. కానీ సీఐడీ అధికారులు ఆయనతో పూర్తి స్థాయి వివరాలు రాబట్టారు. కోర్టు ముందు కూడా వాంగ్మూలాలు ఇప్పించారు. దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఏపీ వ్యక్తి కాదు..అసలు ఏపీ ఉద్యోగి కాదు.. కనీసం ఐఏఎస్ కాదు.. ఆయన రైల్వే ట్రాఫిక్ సర్వీస్ ఉద్యోగి. ఆయనను వైసీపీ నేతలు ఏపీకి పిలిపించి.. ఆయన కేంద్రంగానే మద్యం దందా చేశారనే ఆరోపణ లు వచ్చాయి. వేల కోట్ల ఈ మద్యం స్కాంలో మొత్తం వాసుదేవరెడ్డినే ప్రధాన పాత్రధారి. కానీ ఆయన కేవలం సంతకాలకే పరిమితం. ఆయనకు కొంత కమిషన్ ఇచ్చి ఆయన పేరు మీద స్కాం చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత తన పరిస్థితి ఏమిటో ఆయనకు అర్థమయింది. నోరు తెరవకపోతే తన ఉద్యోగమే కాదు.. తన జీవితం కూడా పూర్తిగా జైలుకు పరిమితమవుతుందన్న అంచనాతో ఆయన మొత్తం వివరాలు సీఐడీకి చెప్పేశారనీ అంటున్నారు. తాము చేయాలనుకున్న అవినీతికి ఓ బకరా కోసమే ఆయనను వైసీపీ నేతలు తెచ్చుకున్నారు. ఆయన ఇప్పుడు అన్ని వివరాలు ఇచ్చేసి.. తన దారి తాను చూసుకున్నారు. ఇక అసలు ఆట ప్రారంభం కావాల్సి ఉంది.

## ప్రకటన

నా క్లయింటు మచిలీపట్నం టౌన్, సర్కిల్ పేట కాపురస్తులు దీవి (లేటు) సీతారామాచార్యులు గారి కుమారుడు దీవి వెంకట అప్పల నరసింహ దీకితులు గారి సంజాయిషీ ప్రకారం యావన్మందికి... తెలియజేయునది ఏమనగా :-

నా క్లయింటు మచిలీపట్నం టౌన్, జలాల్ పేట కాపురస్తులు బొందా (లేటు) సూర్యనారాయణ గారి కుమారుడు (1) బొందా గోపాలకృష్ణారావు, బొందా (లేటు) సూర్యనారాయణ గారి కుమార్తె వివాహ రీత్యా మచిలీపట్నం, చెమ్మనగిరి పేట కాపురస్తురాలు మామిడి కృష్ణమోహనరావు గారి భార్య (2) మామిడి విజయలక్ష్మి వార్ల సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచూ, వారి వద్ద యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నా క్లయింటు కొనుగోలు చేయు నిమిత్తం ఒప్పందం కుదుర్చుకుని ది. 30-01-2025 న కొంత అడ్వాన్సు యిచ్చి అగ్రిమెంటు పొంది యున్నారు. సదరు ఆస్తిని నా క్లయింటు క్రయమైన "రిజిష్టరు సేల్ డీడ్" ను పొందుటకు నిర్ణయించుకున్నందున సదరు ఆస్తిపై ఎవరికైననూ ఏవిధమైన లావాదేవీలు, క్లయిములు మరియు అభ్యంతరములు ఉన్న ఎడల ఈ క్రింది అడ్రస్సుకు ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజుల లోపుగా వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను. లేనిచో సదరు ఆస్తి నిర్వివాదాంశ మనియు, తదుపరి వచ్చు క్లయిములు వగైరాలు నా క్లయింటుని బైండ్ చేయజాలవని యిందు మూలంగా యావన్మందికీ తెలియజేయుచున్నాను.

**ఆస్తి షెడ్యూలు** : కృష్ణా జిల్లా, మచిలీపట్నం స.రి. వారి యిలాకా మచిలీపట్నం టౌన్, జలాల్‌పేట, మున్సిపల్ పాత వార్డు - 25, ప్రస్తుత వార్డు - 28, డోరు నెం. 28/844-845రు నకు చెందినటువంటి ఆస్తిలో సుమారు చ.గ. 177.49 లు లేక చ.మీ. 148.38 లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు :

**తూర్పు : ఉదయగిరి సుదర్శన రామకృష్ణ కుమార్ గారి స్థలం. అ. 33-8 లు**
**దక్షిణం : మా తాలూకు మిగిలి స్థలం అ. 48 లు**
**పడమర : వచ్చుమేడ రోడ్డు అ. 33 లు**
**ఉత్తరం : మున్సిపల్ సిమెంట్ రోడ్డు అ. 47-8 లు**

**యీ హద్దుల మధ్య సుమారు చ.గ. 177.49 లు లేక చ.మీ. 148.36 ర్లు ఖాళీ నివేశన స్థలం.**

ఇట్లు
**మాదివాడ వెంకట నరసింహారావు**
అడ్వకేటు
డోరు నెం. 17-240, ఈడేపల్లి, చిలకలపూడి (P.O) - 521 002.
మచిలీపట్నం, కృష్ణా జిల్లా. Cell : 9440539199, 9246763089.
4-4-2025

# ఉద్యోగుల పెండింగ్... బిల్లులకు త్వరలోనే మోక్షం..!

● రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి బట్టిని కలిసి వినతిపత్రం అందించిన ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు ● సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం ● త్వరలోనే విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం హామీ



**హైదరాబాద్, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం లభిస్తుందని ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి. లచ్చిరెడ్డి తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఉదయం ప్రజా భవన్ లో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి. లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ ప్రతినిధులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను లచ్చిరెడ్డి డిప్యూటీ సీఎం కు వివరించారు. ఇందులో ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ తో పాటు రాష్ట్ర స్థాయిలో మా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ అనివార్యతను వివరించారు. ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్, నాయకుల వినతిపై సానుకూలంగా స్పందించిన బట్టి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని, త్వరలోనే పెండింగ్ లో ఉన్న బిల్లులను విడుదల చేస్తామని హామీనిచ్చారు. డిప్యూటీ సీఎం ను కలిసిన వారిలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె. రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, జనరల్ సెక్రటరీ రమేష్ పాక తదితరులు ఉన్నారు.

In the Court of the IInd Addl. Civil Judge (Senior Division) At Vijayawada
E.P. No. 68/2024 In O.S. No. 759/17

Between :-
Vutukuri Suseela ... DHR

And

1). Kantheti Krishna Veni, W/o. Srinivasa Rao, R/o. D.No. 8-55, Indira Nagar, Lalithayya Colony, Yanamala Kuduru Village, Penamaluru Mandal, Krishna D.Q.
2). Guntur Padmavathi, W/o. Ramu, R/o. D.No. 5-62-11A, 6th Line, 19th Cross Road, Brodipet, Guntur.
3). Nutakki Leelavathi, W/o. Anjaneyulu, R/o. D.No. 7/963, Guraja Village, Mudinepalli Mandal, Krishna D.Q.

... JDR 1 to 3

పై నెంబరు EP లో యిందలి DHR ది. 12-12-2017వ తేదిన Pass కాబడిన Lokadalat Award ప్రకారం EP షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని Register చేయమని పలుమార్లు మిమ్మల్ని కోరియుండగా అందులకు మీరు రాని కారణంగా పై తెలిపిన Court నందు పై తెలిపిన EP ని Regular Sale Deed Register కొరకు యిందలి JDR 1 to 3 లు అయిన మీపై దాఖలు చేసి యున్నారు. యిట్టి స్థితిలో పై నెంబరు EP ది. 21-4-2025వ తేదినకు వాయిదా అయి వున్నది. కావున పై కోర్టు వారి ఆదేశముల ప్రకారము ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు Order 21 Rule 34 Notice లు ఇవ్వటం జరిగినది. కావున మీరు పై తెలిపిన వాయిదా తేది ది. 21-4-2025వ తేదిన ఉదయం 10-30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని లేక మీ అడ్వకేటు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియచేసుకొనవలసి వున్నది. లేనిచో మీకు వరోక్షముగా పై నెంబరు EP దావాను తీర్మానము చేయబడునని యిందుమూలముగా తెలియచేయటమైనది.

వాయిదా తేది : 21-4-2025

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
O. SRINIVASA RAO
Advocate
Vijayawada. Cell No. 9346678145
4-4-2025

## ఇకపై స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు:సబ్ రిజిస్ట్రార్ రామారావు



**కాకినాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా కేంద్రంలో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయని కాకినాడ అర్బన్ జాయింట్-1సబ్ రిజిస్ట్రార్ ఆర్.వి. రామారావు పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టుగా కాకినాడ,అమలాపురం, రాజమహేంద్రవరం జిల్లా కేంద్రాలలో ఈ స్లాట్ బుకింగ్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. మిగిలిన ప్రాంతాల్లోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎప్పటిలా ఆఫ్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని అన్నారు. కక్షిదారులు తేదీ, సమయం ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకుని నిర్దేశించిన సమయానికి వస్తే అర గంటలో రిజిస్ట్రేషన్ పూర్తయి, ఒరిజినల్ దస్తావేజులు ఇస్తారన్నారు. బుక్ చేసుకున్న సమయానికి కక్షిదారులు రాలేకపోతే అదే రోజున కార్యాలయ పనివేళల్లో వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చునని అన్నారు. అదే స్లాట్ బుకింగ్ మరుసటి రోజు ఉపయోగించుకోవడానికి రూ.200 చలనా కట్టి పునరుద్ధరణ చేసుకోవచ్చున్నారు. ఈ స్లాట్ బుకింగ్ ద్వారా కక్షిదారులకు వేచి ఉండే సమయం ఆదా అవుతుందన్నారు. మిగిలిన సేవలు యధాతధంగా జరుగుతాయని తెలిపారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం:ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**కిర్లంపూడి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. కిర్లంపూడి మండలం తామరాడలో వ్యవసాయ అధికారిని జోకా అమృత ఆధ్వర్యంలో మొక్క జొన్నల స్వామికి పవర్ టిల్లర్ (చిన్న ట్రాక్టర్) రైతులకు ఉచితంగా మినుములు విత్తనాలు విబిఎన్ 8 రకం అందజేశారు. ఈ సందర్భంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రతి రైతాంగానికి సహకారం అందించేందుకు ఆధునిక యంత్రాలతో వ్యవసాయం చేస్తే రైతుకు అన్ని విధాల సౌకర్యంగా ఉంటుందని. ఆధునిక యంత్రాలు కూటమి ప్రభుత్వంలో మాత్రమే జరుగుతుందని. గత ప్రభుత్వం ఎక్కడ రైతులకు ఆధునిక యంత్రాల పంపిణీ కార్యక్రమం చేయలేదని మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈరోజు రైతులకు మినీ గోకులం షెడ్లు నాణ్యమైన విత్తనాలు పురుగుల మందులు అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జెడ్పిటిసి తోట గాంధీ ,అనుకుల శ్రీకాంత్, చదరం చంటిబాబు,వీరం రెడ్డి కాశీ బాబు, నీలం శ్రీను , తూము కుమార్, దేవరపల్లి మూర్తి, గుడాల రాంబాబు, పాఠం శెట్టి మురళీకృష్ణ ,కుర్ల చినబాబు, జ్యోతుల రాంబాబు, కాళ్ళ వెంకటేష్. కంచుమర్తి రాఘవ, సేనాపతి చల్లారావు, పాఠం శెట్టి రవి, బూదిరెడ్ల, సుబ్బారావు ,తామరాడ ఎంపీటీసీ. గోకాడ రాజా, పంచాది నానాజీ తదితర నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించిన ఎమ్మెల్యే కాగిత



**పెడన,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ శుక్రవారం నాడు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. స్థానిక దేవాంగ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలో ని పెడన పట్టణం అగస్త్యేశ్వరాపురనికి చెందిన రౌతుల రాఘవమ్మ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.81101 రూపాయలు గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన బొడ్డు బాల మల్లేశ్వరి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.2లక్షల 56వేలు విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కృష్ణ ప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబంలో ఒకరు అనారోగ్యం పాలయితే కుటుంబం మొత్తం కలత చెందుతుందని అన్నారు. ఈ సహాయం వీరికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు టిడిపి పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య కప్పలదొడ్డి మాజీ సర్పంచ్ కట్ట మునీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి మిత్ర కిట్ల మండల స్టాక్ పాయింటు ను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు



**పెడన,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఈ విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర( ఎస్. ఆర్. కే. వీ.ఎం.-1) స్టూడెంట్ కిట్ల మండల స్టాక్ పాయింట్ పరిశీలన లో భాగంగా పెడన లోని శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కాలేజి నీ సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు జి.మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఉచితంగా ఏక రూప దుస్తులు బ్యాగ్ బెల్టు బూట్లు డిక్షనరీ లు నోటు పుస్తకాలు అదించనుందని ఈ పథకం సక్రమంగా అమలు జరిపేందుకు సామాగ్రి భద్ర పరుచుటకు మరియు పాఠశాలల్లోని విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో అందించేందుకు, జిల్లా స్థాయి, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసిందని అన్నారు.వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం నాటికి స్టూడెంట్ కిట్లు విద్యార్థులకు అందించడమే ప్రభుత లక్ష్యమని అన్నారు. ఇందులో భాగంగా సామాగ్రి భద్ర పరిచే తరగతి గదులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కృష్ణ జిల్లా కమ్యూనిటీ మొబైలిజేషన్ ఆఫీసర్ రమేష్ హరనాథ్ మండల సిబ్బంది పాల్గొన్నారు.

# మొబైల్ అవుట్ రీచ్ సేవల ద్వారా హెచ్ఐవి నిర్మూలనకు అవకాశం :జెసి రాహుల్ మీనా



**కాకినాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** జిల్లాలో హెచ్ఐవి నిర్మూలనకు మొబైల్ అవుట్ రీచ్ వాహన సేవలు దోహదపడతాయని జిల్లా జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా పేర్కొన్నారు.కౌన్సెలింగ్, టెస్టింగ్ సేవలు విస్తరింపులో భాగంగా భారతదేశం మొబైల్ ఐసీటీసీ హెచ్ఐవి మొబైల్ వాహనాన్ని కలెక్టరు కార్యాలయంలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పారామెడికల్ హెల్త్-కేర్ ప్రొవైడర్ల బృందం (కౌన్సెలర్, లాబ్ టెక్నీషియన్)తో కూడిన మొబైల్ వాహనం సమస్యాత్మక ప్రాంతాల్లో సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు.తద్వారా హెచ్ఐవి వ్యాధి పట్ల అవగాహన, కేసుల గుర్తింపు,చికిత్సకు సత్వర అవకాశాలు ఉంటాయని అన్నారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డా.ఆర్.రమేష్ మాట్లాడుతూ కష్టతరమైన ప్రాంతాలలో సౌకర్యవంతమైన పని గంటలతో తాత్కాలిక క్లినిక్‌ను ఏర్పాటు చేయడానికి మొబైల్ సేవలు ఉపయోగించబడుతుందన్నారు. ఇక్కడ సేవలలో సాధారణ ఆరోగ్య తనిఖీలు, ఎస్టిఐ/పునరుత్పత్తి మార్గ సంక్రమణ (ఆర్టిఐ) కోసం సిండ్రోమ్ చికిత్స, ప్రసవానంతర సంరక్షణ, రోగ నిరోధకత, అలాగే హెచ్ ఐ వి అవగాహన, పరీక్ష సేవలు ఉంటాయన్నారు.వాహనంలో ఒక కౌన్సెలర్,ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్ క్లయింట్లకు ప్రమాద తగ్గింపు కౌన్సెలింగ్, ప్రమాద అంచనా వేసి హెచ్ఐవి నివారణలో అధిక-ప్రమాదకర జనాభాకు కండోమ్ల పంపిణీ జరిగుతుందన్నారు. మొబైల్ క్యాంపు ప్రతి యూనిట్‌కు రోజు వారీగా వారం వారీగా ప్రణాళికలు రూపొందించబడతాయన్నారు. మొబైల్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫార్మా విద్యార్థిని నాగ అంజలి మృతి బాధాకరం

- ఆడవాళ్ళ జోలికొస్తే తాటతీస్తా నన్న పవన్ కళ్యాణ్ ఏమయ్యాడు
- వైసీపీ ఉమ్మడి గోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇంచార్జి జమ్మలమడక నాగమణి



**కాకినాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** బొల్లినేని ఆసుపత్రిలో మేనేజర్ గా పనిచేస్తున్న దీపక్ లైంగిక వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన ఫార్మసీ విద్యార్థిని నాగంంజలి 12 రోజులు మృత్యువుతో పోరాడి మృతిచెందడం ఎంతో విచారకరమని వైసీపీ ఉమ్మడి గోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇంచార్జి జమ్మలమడక నాగమణి అన్నారు. నిందితుడు దీపక్ ను వెంటనే అరెస్టు చేయాలని ఆమె డిమాండు చేశారు. నిందితుడు అధికార పార్టీ ఎమ్మెల్యే బంధువైనంతమాత్రాన నేరస్తుడు కాకుండా పోడని నిందితుడిని తక్షణ అరెస్టు చేసి శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని మహిళలు బాలికలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిలో ఉంటే ప్రజాప్రతినిధులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకుంటూ నాటకాలు ఆడుతున్నారని ఆమె విమర్శించారు. పెళ్లయిన 12 సంవత్సరాలు తరువాత పుట్టిన బిడ్డ ఒక కామాంధుడి లైంగిక వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకుని 12 రోజులు మరణశయ్యపై ఉండి మరణిస్తే ఆ తల్లిదండ్రుల ఆవేదన ఎంత భయంకరంగా ఉంటుందో ఒక తల్లిగా తాను అర్థం చేసుకోగలరని ఆమె అన్నారు. దీనికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని ఆమె డిమాండు చేశారు. పోలవరం వచ్చిన సీఎం చంద్రబాబు రాజమండ్రి ఆసుపత్రిలో ఉన్న బాధితురాలని పరామర్శించకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆడపిల్లల జోలికి వస్తే తోలు తీస్తానన్న పవన్ కళ్యాణ్ దీనిపై స్పందించకపోవడం విచారకరమనీ అన్నారు. మహిళా హోం మంత్రి ఇటువంటి చర్యలను ఖండించకపోవడం ఈ సంఘటనపై స్పందించకపోవడం ఆమె అసమర్థతకు భాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమాలపై మాట తప్పిన ప్రభుత్వం కనీసం మహిళల నైనా రక్షణ కల్పించి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ తరపున బాధిత విద్యార్థిని కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వారి తల్లిదండ్రులకు హామీ ఇచ్చారని రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి,అధికార ప్రతినిధి శ్యామలతో పాటు మహిళా విభాగం జోనల్ ఇన్చార్జిగా తాను కూడా బాధితురాలిని పరామర్శించడం జరిగిందని ఈలోపు నాగాంజలి మృతి చెందడం ఎంతో విచారకరమని దీనికి ప్రభుత్వం బాధ్యత వహించి మృతురాలి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి

- రూ.16.53 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- పలు శంకుస్థాపనలు చేసిన కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ.16.53 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ నాయుడులు శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, మున్సిపల్ సాధారణ నిధులుతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. తొలుత వెల్ల లోని హెడ్ వాటర్ ట్యాంకు ముఖద్వారం గేటు, ఇతర మరమ్మత్తుల కోసం రూ. 4.99 లక్షలు, 2వ వార్డు స్టిల్ వెల్ పేటలో రూ.5 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి, లలిత నగర్ 16 వార్డులోని సి సి రోడ్డు నిర్మాణానికి రూ.3.30 లక్షలు, అలాగే శాంతి నగర్ 9వ వార్డులో సీసీ డ్రైయిన్ నిర్మాణానికి రూ.3.24 లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులుకు శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాల్లో ప్రజల మౌలిక సదుపాయాలు కల్పన దిశగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. త్రాగునీరు, సిసి రోడ్ల నిర్మాణం, డ్రైన్స్ నిర్మాణం వంటి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం తగినన్ని నిధులు మంజూరు చేసిందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చ క్రమంలో కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ శ్రీకాంత్, ఎఈ లు, కూటమి పార్టీ నాయకులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి - సినీ నటుడు అంబటి అర్జున్

- జెడ్పి స్కూల్ లో ఘనంగా క్రీడా వార్షికోత్సవం





**జి.కొండూరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** క్రీడలు మానసిక ఉల్లాసానికి,శారీరక దారుఢ్యానికి తోడ్పడతాయని సినీ నటుడు అంబటి అర్జున్ అన్నారు.స్థానిక ఎస్ ఎస్ ఆర్ ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన క్రీడ వార్షికోత్సవానికి సినీ నటుడు అంబటి అర్జున్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థు లు చదువు తో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నా రు.అనంతరం క్రీడల్లో రాణించిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేశారు. అంతకుముందు విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.ఈ సందర్భంగా 1994-95 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ. 10,000 లు విలువ గల క్రీడా పరికరాలు, అలాగే టీం రమణ యూత్ సభ్యులు మెమొంటోలు వితరణగా అందజేశారు. క్రీడా ప్రాంగణంలో క్రీడా వార్షికోత్సవం ఏర్పాట్లకు టెంట్ సామాన్లను పజ్జూరు విజయ్ , విద్యార్థులకు తల్లిదండ్రులకు విందు ఏర్పాట్లను పాఠశాల పిడి ఆర్.సీజర్ రెడ్డి పిఈటి మాధవరావు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం శ్రీలత,తెదేపా నాయకులు వుయ్యూరు వెంకట నరసింహారావు,అంకెం ఇందిరా ప్రియదర్శిని, 1994-95 పదో తరగతి పూర్వ విద్యార్థులు బడుగు రమేష్ (బుజ్జిబాబు),పజ్జూరు శ్రీను (మీ సేవా శ్రీను), అవులూరు నాగిరెడ్డి, పల్లపోతు విజయ్,పి ఎం సి చైర్మన్,నాయకులు వుయ్యూరు చంద్రశేఖర్, తల్లిదండ్రులు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గొల్లప్రోలు నూతనంగా నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ కె.నాగబాబు



**గొల్లప్రోలు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని కోకిలవాణి హాస్పిటల్ రోడ్డు లో సీఎస్ఆర్ నిధులు రూ.88.98 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం శాసనమండలి సభ్యులు కొణిదెల నాగబాబు.. శాసనమండలి ప్రభుత్వం విప్ హరిప్రసాద్,జిల్లా కలెక్టరు షాన్ మోహన్,ఎస్పీ జీ.బిందు మాధవ్,రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్,కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పిఠాపురం జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాసు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలోని వివిధ సౌకర్యాలను వార్డులను ఎమ్మెల్సీ నాగబాబు పరిశీలించారు. వైద్యాధికారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఠాపురం ప్రాంతం అభివృద్ధి అథారిటీ (పాడా) ప్రాజెక్టు అధికారి చైత్రవర్షిణి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.జె. నరసింహ నాయక్, పిఠాపురం నియోజకవర్గం ఇతర ప్రజా ప్రతినిధులు, గొల్లప్రోలు నగర పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన కలెక్టర్



**నందిగామ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అందరూ సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి లక్ష్మీ షా దేవినేని వెంకట రమణ ఏరియా ప్రభుత్వ హాస్పిటల్ సూపరెంటెంట్ ను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాస్పిటల్ పరిసరాలను పరిశీలించి శానిటేషన్ పై శ్రద్ధ తీసుకోవడం పట్ల హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు అభినందించారు.

## మండలి బుద్ధప్రసాద్ కు అభినందనలు తెలిపిన విశ్రాంత కలెక్టర్ లక్ష్మీకాంతం..



**అవనిగడ్డ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ను ఉమ్మడి కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.అవనిగడ్డలోని మండలి నివాసానికి వచ్చిన విశ్రాంత కలెక్టర్ లక్ష్మీకాంతం దంపతులను మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు సాదరంగా ఆహ్వానించారు.అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్ గా ఎంపికైన బుద్ధప్రసాద్ కు విశ్రాంత కలెక్టర్ లక్ష్మీకాంతం దంపతులు పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభించిన సిఐ వీరబాబు



**అమలాపురం,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** అమలాపురం పట్టణ దేవతల కొలువైన శ్రీ సుబ్బాలమ్మ ఆలయ ప్రాంగణంలో శ్రీ రామానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అమలాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.వీరబాబు ప్రారంభించారు. ద్వారంపూడి బాల మురళి శ్రీనివాసరెడ్డి సమకూర్చిన కొబ్బరిబండాలను బాటసారులకు. భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్య నాయుడు,ఎర్రంశెట్టి నారాయణమూర్తి, తిక్కిరెడ్డి నేతాజీ, ముత్యాల గంగాధర్,నిమ్మకాయల నాని,మానే ప్రకాష్,బులియన్ అసోసియేషన్ సభ్యులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా చర్యలు: కలెక్టరు ఆర్.మహేష్




**అమలాపురం,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా చర్యలు చేపడుతూ ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలని జిల్లా కలెక్టరు ఆర్. మహేష్ కుమార్ కమిటీ సభ్యులకు పిలుపు నిచ్చారు స్థానిక కలెక్టరేట్లో 13వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సా హక కమిటీ (డీఐఈపీసీ) స మావేశం శుక్రవారం జిల్లా కలెక్టర్ కమిటీ చైర్మన్ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి దార్శనిక తతో, వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధి లక్ష్యంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీ పి) సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎం ఎస్ ఎం ఈ)వంటి పథకాలను సద్విని యోగం చేసుకునేలా పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సులను యువతకు మండల స్థాయిలో ముందుగా నిర్వహించి తదుపరి నియోజకవర్గ స్థాయిలో కనీసం 2 మందితో నిర్వహించి పరిపూర్ణ మైన అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో పరిశ్రమలు, పీఎంఈజీపీ కింద ఏర్పాటైన పారిశ్రామిక యూనిట్ల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు, వాటి నిర్వహణలో ఏవైనా ఇబ్బందులుంటే చక్కదిద్ది పురోగతి దిశగా నడిపించాలని సూచిం చారు. గడచిన త్రైమాసి కంలో వివిధ పథకాల కింద 20 ప్రతిపాదనలు సేకరించగా వాటిలో 19 యూనిట్లుకు గాను రూ. 2కోట్ల 65 లక్షలు కమిటీ సభ్యులు అనుమతితో ఆమోదం తెలిపారు. మిగతా వాటిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారు. కోకో ఎక్స్పోజర్ సందర్శన కొరకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కో కో ఫెర్మెంటేషన్ యూనిట్ ప్రతిపాదనలు సిద్ధపర చాలని సూచించారు. కోనసీమ ప్రాంత అభి వృద్ధికి నాబార్డు, సిడ్బి గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధనం తదితర శాఖల సమన్వయంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు అభిప్రాయాలకు అను గుణంగా వివిధ రకాల యూనిట్లు మంజూరుకు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి సాధించడానికి ఔత్సాహిక మరియు ఆశావహ దృక్పథం కలిగిన ప్రతిపాదనలు రూపకల్పన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరిశ్రమల అనుమతులు విషయంలో యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అనుమతుల విషయములో ఖచ్చిత మైన మార్గదర్శకాలు అనుసరించి, సరళీకృత విధానాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. పరిశ్రమలు ఏర్పాటు కోసం విచ్చేసే పారిశ్రామికవేత్తలను సింగిల్ విండో ఏకగవాక్ష విధానంలో అనుమతులన్నీ కేంద్రీకృతంగా అం దించాలని స్పష్టం చేశారు. తద్వారా పీచు పరిశ్రమల ఉత్ప త్తులకు స్థానికంగా డిమాండు లభిస్తుందన్నారు.ఇంకులేషన్ కేంద్రాలు ఏర్పాటు ద్వారా ఒక్కొక్క కొబ్బరి ఉత్పత్తికి గరిష్టంగా రూ. 25 లక్షలు ఆర్థిక సహాయాన్ని కేంద్రం అందించనున్నదన్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. పీఎం విశ్వకర్మ యువజన ద్వారా 3,815 మందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి 350 యూనిట్లను రూ.3 కోట్ల 25 లక్షల నిధులతో మంజూరు చేయడం జరిగిందన్నారు. ఏకగవాక్ష (సింగల్ విండో) విధానం ద్వారా పారి శ్రామిక అనుమతుల కొరకు 1,718 దరఖాస్తులు స్వీకరించగా వీటిలో 1661 దరఖాస్తులు పరిష్కరించడం జరి గిందని మిగిలినవి ప్రాసెస్లో ఉన్నాయన్నారు. ఎంఎస్ఎం ఈ లక్ష్యాలను మించి పురోగతి సాధించామని మంజూరైన మూడు యూనిట్లను లబ్ధిదారుల నిర్వహణ మార్చాలని కోరుతున్నారని వీటిపై అధ్యయనం చేసి తదుపరి కమిటీ సమావేశంలో సభ్యుల అనుమతితో మార్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణా రెడ్డి మత్స్యశాఖ జీడి జీ వీ శ్రీనివాసరావు,పరిశ్ర మల కేంద్రం సహాయ సంచాలకులు శివరాం ప్రసాద్,ఎల్ డి ఎం.కేశవ వర్మ, సిడ్బి ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొ న్నారు.

నాగారం మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీపై కీసర ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన...

## నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



**కీసర, నాగారం,04:(వార్తా ప్రభ)** నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో గత కొన్ని నెలలుగా నిలిచిపోయిన కళ్యాణ లక్ష్మి చెక్కులను వెంటనే పేద ప్రజలకు అందించాల్సిందిగా శుక్రవారం కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీ పరిధిలో 80 చెక్కులు మరియు కీసర ఆర్డీవో డివిజన్ పరిధిలో సుమారు 2000 చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడం, స్థానిక మేడ్చల్ ఎమ్మెల్యే బి ఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తి ఎమ్మెల్యే కావడం వల్ల, ఇరువురి పార్టీల సమన్వయలోపం వల్ల చెక్కుల పంపిణీ సమయానికి మంజూరు చేయకపోవడంతో ప్రజలు అయోమయ పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం త్వరగా స్పందించి పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే పంపిణీ చేయాల్సిన అవసరం ఉందని ఆర్డీవోకి తెలియజేశారు.ఈ విషయంపై ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని సంబంధిత ఎమ్మార్వోలకు వెంటనే ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్ గౌడ్, బుద్ధవరం లక్ష్మీ, మరియు నాగారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు కొండబోయిన నాగరాజ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వివేకానంద నగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి 34వ వార్షికోత్సవ వేడుకలు...

**సతీ సమేతంగా పాల్గొని పూజలు చేసిన వడ్డేపల్లి రాజేశ్వరరావు...**



**కూకట్ పల్లి,ఏప్రిల్ 4(వార్తప్రభ):**కూకట్ పల్లీ వివేకానంద నగర్ లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఈనెల 2'వ తేదీ నుంచి 34'వ వార్షిక బ్రహ్మోత్సవములు అంగరంగా వైభవంగా నిర్వహిస్తున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సతీసమేతంగా శ్రీవర్ల శాంతి కళ్యాణ మహోత్సవములో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ కృపాకటాక్షాలకు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. తదనంతరం ఆలయ ప్రాంగణం నందు నిర్వహించిన అన్న సమారాధన అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. లోకకళ్యాణార్థం నిర్వహించే శ్రీవారి కల్యాణంలో పాల్గొన భక్తజనులు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ, 6'వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే శ్రీరామనవమి వేడుకల్లో ఎక్కడికక్కడ ప్రతి ఒక్క హిందువు తప్పనిసరిగా కళ్యాణ ఉత్సవంలో పాల్గొనవలసిందిగా వడ్డేపల్లి రాజేశ్వరరావు కోరారు.

## పేదలకు ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి...

*కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్*



**కూకట్ పల్లి ఎప్రిల్ 4(వార్తాప్రభ):**ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అప్పన్న హస్తంలా ఆదుకుంటుందని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్పల్లి నియోజకవర్గంలో పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన1,03,250 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిదినీ శుక్రవారం పంపిణీ చేశారు.మూసాపేట్ కి చెందిన నరసింహ చారి కి 60,000/- చెక్కు, బాలనగర్ కి చెందిన సరోజ .బీరగోని కి 39,000/ చెక్కు అల్లాపూర్ కి చెందిన రైనీ.భూలక్ష్మి కి 42,500/- చెక్కులు మంజూరవగా వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిరెడ్డి, తూము వేణు, పుష్ప రెడ్డి, లక్ష్మయ్య, దండగుల యాదగిరి, రాఘవేందర్, కుక్కల రమేష్, యుగేందర్ , మధు గౌడ్, మేకల రమేష్, మల్లికార్జున్ యాదవ్, మస్తాన్ రెడ్డి, అయాజ్ , ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రజాపాలనలో ఉచిత సన్న బియ్యం పంపిణీ!!

● తెలంగాణ ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం ● సీఎం రేవంత్ పాలనలో అన్ని వర్గాలకు ఆదరణ ● ప్రతి ఒక్కరికి ఆరు కిలోలు బియ్యం ● అక్రమాలు చేస్తే చర్యలు తప్పవు ● రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 4 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రజాపాలనలో ఉచిత సన్న బియ్యం లబ్ధిదారులందరికీ పంపిణీ చేయడం ఆనందాన్ని కలిగిస్తున్నదని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని బసంత్ నగర్ గ్రామంలో ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ....ఏ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పేద కుటుంబాలకు సన్న బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో లేని పథకాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారని తెలిపారు. సీఎం రేవంత్ పాలనలో అన్ని వర్గాలకు ఆదరణ లభిస్తున్నదని అన్నారు. గత ప్రభుత్వాలు పేదల అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. ప్రతి ఒక్కరికి ఆరు కిలోలు బియ్యం పంపిణీ చేస్తామని, అక్రమాలు చేస్తే చర్యలు తప్పవు అని హెచ్చరించారు.

# కాలనీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యత మాదే

**-ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ అమీద్ పటేల్ ల హామీ**



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ):**నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ,కార్పొరేటర్ హమీద్ పటేల్ శుక్రవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ఓయూ ప్రొఫెసర్ కాలనీలో అరవై లక్షలు రూపాయలు అంచనా వ్యయంతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు గాను స్థానిక నాయకులతో కలసి పిఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ,కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ కలసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు నిత్యం అవసరం అయినా మౌలిక వసతుల ఏర్పాటుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలియజేశారు. కోట్ల రూపాయలు వ్యయంతో అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని అన్నారు.ప్రజలు కోరుకొనే విధంగా కాలనిలను అభివృద్ధి చేసే బాధ్యత మాపై ఉందని, నూటికి నూరు శాతం వారు కోరుకొనే విధంగా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ,కార్పొరేటర్ హమీద్ పటేల్,సీనియర్ నాయకులు కొసరాజు లక్ష్మణ్, షేక్ చాంద్ పాషా,సుద్దపల్లి విజయ్ కృష్ణ, విజయ్ శర్మ, కరీం లాలా,పెరుక రమేష్ పటేల్,మధు ముదిరాజ్,దీపక్ కచ్చావా,బోయినపల్లి గోపి కృష్ణ రావు,కొండల విద్యా సాగర్ రెడ్డి,అరుణ్,శ్రీకాంత్,అజిత్ రెడ్డి, సీహెచ్ సంతోష్,కే సంతోష్, ప్రభాకర్ రెడ్డి,శ్రీనివాస్ చౌదరి, రజనికాంత్,బుడుగు తిరుపతి రెడ్డి,రవి శంకర్ నాయక్,ఎర్ర రాజు,బసవ రాజు,కాట్రగడ్డ బసవ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్లో రేషన్ షాప్ లలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన బిజెపి నాయకులు

**రేషన్ షాపుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలి- రంగుల శంకర్ నేత**



**జవహర్ నగర్, ఏప్రిల్, 04:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోగల రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన రాష్ట్ర అధికార ప్రతినిధి బిజెపి ఓబీసీ మోర్చా రంగుల శంకర్ నేత ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో రేషన్ దుకాణాలలో కరోనా సమయం నుండి ప్రతి ఒక్కరికి ఉచితంగా రేషన్ షాపులలో బియ్యం పంపిణీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పంపిణీ చేసే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోల బియ్యం నరేంద్ర మోడీ పంపి స్తున్నారనీకేవలం ఒక కిలో మాత్రమే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుంది కావున ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రతి ఒక్క రేషన్ దుకాణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని తెలియజేయడం జరిగింది.మొత్తం ఆరు కిలోలు మనిషికిఐదు కిలోల సన్న బియ్యం కేంద్రం బీజేపీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పంపిస్తున్నారు. మనిషికి ఒక కిలో సన్న బియ్యం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ వాటా అని అన్నారు.ఇది ప్రజలకి నిజాలు తెలియక రాష్ట్ర ప్రభుత్వం (రేవంత్ రెడ్డి- కాంగ్రెస్ ప్రభుత్వం) అందజేస్తుందని అనుకుంటున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చేది మనిషికి ఒక కిలో మాత్రమే అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముత్యం సుజాత రాష్ట్ర ఎస్సీ మోర్చా సెక్రటరీ,మహేష్ గౌడ్ సెక్రటరీ, కోస్గి శివ కేశవ్ బిజెపి మాజీ వైస్ ప్రెసిడెంట్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, విగ్నేష్, వీరబత్తిని బాలకృష్ణ,భాను కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సర్వైకల్ క్యాన్సర్ మహమ్మారిని వ్యాక్సిన్ తో పూర్తిగా నివారించవచ్చు...

**రాందేవ్ ఆసుపత్రి యాజమాన్యం**




**కూకట్ పల్లి,ఏప్రిల్ 4(వార్తప్రభ):**రాందేవ్ ఆసుపత్రి, కార్నర్ స్టోన్ అనే సాఫ్ట్ వేర్ సంస్థ సంయుక్తంగా శుక్రవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలకు ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ఇచ్చారు. రిక్షా పుల్లర్స్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలు సుమారు 200 మంది పాల్గొని ఈ సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు విక్రం దేవ్ మాట్లాడుతూ నేటి బాలికలను ఆరోగ్యవంతంగా పెంచితే భవిష్యత్ తరాలు, సమాజం ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతాయన్నారు. పేషెంట్ కి ప్రాణాపాయ స్థితి లో కృత్రిమం గా శ్వాస ను అందించే వెంటిలేటర్ మానిటర్ తో కలిపి రూ. 24 లక్షల రూపాయలను కార్నర్ స్టోన్ సంస్థ ఆసుపత్రికి విరాళం ప్రకటించిందన్నారు. డాక్టర్ మీరా రావు మాట్లాడుతూ సమాజంలో ని నిరుపేదమహిళలు స్త్రీ సాధికారతను సాధించాలని సూచించారు. వ్యాక్సినేషన్ అనేది ప్రాథమిక నివారణ అని, హెచ్ పి వి కోర్టెస్ట్ అనేది రెండో నివారణ వీటి మీద కూడా అతి తక్కువ రుసుముతో అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. నిరుపేదల ఆరోగ్యానికి అయ్యే అధిక ఖర్చులను నివారించడానికి రాందేవ్ రావు ఆసుపత్రి ఎప్పుడు తన వంతు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్నర్ స్టోన్ సాఫ్ట్ వేర్ సంస్థ నిర్వాహకులు అభిషేక్ గుప్తా, కిరణ్ తనికెళ్ళ, భార్గవి, కె నిశిల్, పవన్,కోర్ కమిటీ సభ్యులు హర్ష పీటర్ జై తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే చట్ట రిత్యా చర్యలు తప్పవు

**మందమర్రి ఎస్సై రాజశేఖర్**

**మందమర్రి ఏప్రిల్ 4(వార్తప్రభ):** రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ జా (ఐపీఎస్) , మంచిర్యాల డిసిపి ఏ.భాస్కర్ ఐపీఎస్ ఉత్తర్వుల మేరకు బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి ఆదేశాలతో మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో సారంగపల్లి గ్రామంలో శుక్రవారం రోజున నకిలీ పత్తి విత్తనాలపై పోలీసు, వ్యవసాయ శాఖ,రెవెన్యూ శాఖ,పంచాయతీ రాజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అక్కడి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని కిరణ్మయి మాట్లాడుతూ.నకిలీ విత్తనాలు వాడడం వల్ల భూమి యొక్క సారవంతం కోల్పోయి రానున్న రోజుల్లో పంట యొక్క దిగుబడి తగ్గుతుంది. అదేవిధంగా పర్యావరణం పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. కౌలు రైతులు కూడా ఈ నకిలీ విత్తనాలను వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందని ఈ నకిలీ విత్తనాలు వాడటం వల్ల రెండు మూడు క్వింటాళ్లు అధిక లాభం వస్తుందని ఆశపడితే పంట నష్టపోయిన తర్వాత కూడా మీకు ప్రభుత్వం నుండి ఎలాంటి నష్టపరిహారం వాటిల్లదు అని ప్రజలకు సూచించారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## ప్రజల ఆరోగ్యం కోసం మెడికల్ క్యాంపు!!

● ప్రజా సేవలో సింగరేణి సిఎస్ఆర్ ● దీర్ఘకాలిక వ్యాధుల పట్ల జాగ్రత్త అవసరం ● హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారం పద్మ




**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 4 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రజల ఆరోగ్యం కోసం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం లింగాపూర్ గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించామని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారం పద్మ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మ మాట్లాడుతూ..... ప్రజా సేవలో సింగరేణి సిఎస్ఆర్ ముందు వరుసలో నిలుస్తుంది అని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధుల ( షుగర్, బీపీ, థైరాయిడ్ ) పట్ల జాగ్రత్త అవసరం అని క్రమం తప్పకుండా మందులు వాడాలి అని, తరచూ సంబంధిత డాక్టరుని సంప్రదించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జివన్ ఎస్ఓటు జిఎం గోపాల్ సింగ్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ ఆంజనేయ ప్రసాద్, మేనేజర్ మల్లిఖార్జున యాదవ్, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ బడిలోనే బాల విద్యకు భవిత!!

● ఇందిరానగర్ బడిలో అక్షరాభ్యాసం ● ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ● చక్కని చదువుకు సర్కారు బడిలో చేర్పించాలి ● అంగన్‌వాడీ కార్యకర్త రజిత



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 4 (వార్తాప్రభ ప్రతినిధి)** అంగన్‌వాడీ బడిలోనే బాల విద్యకు భవిత అని ఇందిరానగర్ అంగన్‌వాడీ కార్యకర్త రజిత అన్నారు. ఈ మేరకు శుక్రవారం రామగుండం నగరపాలక సంస్థ 38వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్త రజిత మాట్లాడుతూ.....చక్కని చదువుకు సర్కారు బడిలో చేర్పించాలి అని అన్నారు. ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లులకు సూచించారు. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సకల సౌకర్యాలతో ఆంగ్ల మాధ్యమంతో బోధన సాగిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న ఈ సదుపాయాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పలువురు గర్భిణీ స్త్రీలు, తల్లులు, పిల్లలు, అంగన్వాడి ఆయా అరుణ, గ్రూప్ లీడర్ కొమరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ సిఫార్సు లేఖల కోసం ప్రత్యేక పోర్టల్

*టీటీడీ దర్శనానికి ప్రత్యేక పోర్టల్ అందుబాటులో ప్రజాప్రతినిధులు ఇకపై పోర్టల్ ద్వారానే సిఫార్సు లేఖలు పోర్టల్‌లో లేని లేఖలను టీటీడీ అంగీకరించదు*

**హైదరాబాద్ ఏప్రిల్ 4 (వార్తాప్రభ ప్రతినిధి):** తెలంగాణ ప్రజాప్రతినిధులు ఇకపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి ఇచ్చే సిఫార్సు లేఖల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్ ద్వారా లేఖలు పంపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు భక్తులకు ఇచ్చే విఐపి బ్రేక్ దర్శనం, రూ. 300 ప్రత్యేక దర్శన టిక్కెట్లకు సంబంధించిన లేఖలన్నీ ఈ పోర్టల్ ద్వారానే సమర్పించాల్సి ఉంటుందని అధికారికంగా ప్రకటించారు.భక్తుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం ఈ పోర్టల్‌ను ప్రజాప్రతినిధులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇకపై ప్రజాప్రతినిధులు ఈ పోర్టల్ ద్వారానే సిఫార్సు లేఖలను తయారు చేసి, వాటిని సంతకం చేసిన తర్వాత స్కాన్ చేసి అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం భక్తులకు అసలు లేఖను అందజేయవచ్చు. ఈ విధానం ద్వారా ప్రజాప్రతినిధులు ఇచ్చే లేఖలకు ఒక ప్రత్యేకమైన సమర్థమైన విధానం నెలకొంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ పోర్టల్‌లో నమోదైన లేఖల వివరాల ప్రకారమే టీటీడీ భక్తులకు దర్శన అనుమతులను మంజూరు చేస్తుందని స్పష్టం చేశారు. పోర్టల్‌లో లేనికాని లేఖలను తిరుమల తిరుపతి దేవస్థానం అంగీకరించదని తెలియజేశారు. ప్రజా ప్రతినిధులకు ఈ పోర్టల్‌ను ఎలా ఉపయోగించాలో వివరించే యూజర్ గైడ్ కూడా అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజలకు మరింత పారదర్శకంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు అందరూ ఈ కొత్త విధానాన్ని పాటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## కేంద్ర మంత్రికి ఎంపీ,ఎమ్మెల్యేల సన్మానం

**ఆదిలాబాద్ ఏప్రిల్ 4 (వార్తాప్రభ ప్రతినిధి)**పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకి సన్మానంఅదిలాబాద్ జిల్లాలో ప్రతిపాదిత పౌర విమానాశ్రయానికి భారత వైమానిక దళం ఆమోదం తెలపడం పట్ల జిల్లా శాసనసభ్యులు హర్షం వ్యక్తం చేశారు

# ఎడిటోరియల్

## 15 ఏళ్ల బాబు పాలనపై జనసేన ఇలా.. బీజేపీ అలా..!

ఏపీలో కూటమి ప్రభుత్వంపై.. జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒకరకంగా స్పందిస్తుంటే.. బీజేపీ నాయకులు మరో విధంగా స్పందిస్తున్నారు. వచ్చే 15 ఏళ్లపాటు.. చంద్రబాబే ముఖ్య మంత్రిగా ఉంటారని జనసేన అధినేత చెబుతున్నారు. తాను చంద్రబాబు నుంచి ఎంతో నేర్చుకుంటున్నానని కూడా ఆయన అంటున్నారు. తనకు పాలన పరంగా చంద్రబాబు మార్గదర్శి కూడా చెబుతున్నారు. ఆయన అనుభవాన్ని పదే పదే ప్రస్తావిస్తూ.. 15 ఏళ్లపాటు ఆయన సారథ్యం అవసరమని చెబుతున్నారు.అంటే.. వచ్చే 15 సంవత్సరాల పాటు.. అంటే.. మరో మూడు ఎన్నికల వరకు కూడా.. చంద్రబాబును ముఖ్యమంత్రిగా జనసేన అంగీకరిస్తోంది. దీనికి కారణాలు ఏవైనా.. జనసేన తన లైన్‌ను ప్రకటించింది. తద్వారా ఆ పార్టీకి ఇబ్బందులు వస్తాయా? లేదా? అన్నది పక్కన పెడితే.. జనసేన మాత్రం పక్కా క్లారిటీతో ఉంది. ఇక, కూటమిలో మరో భాగస్వామ్య పార్టీగా ఉన్న బీజేపీ మాత్రం ఈ విషయంలో పవన్‌తో విభేదిస్తుండడం గమనార్హం.బీజేపీ సీనియర్ నాయకుల్లో చాలా మంది టీడీపీ నుంచి వచ్చినవారే ఉన్నారు. ఇక, పార్టీ ఏపీ చీఫ్ పురందేశ్వరి ఉన్నప్పటికీ.. చంద్రబాబును ఆమె పరోక్షంగా సమర్థిస్తున్నారు. కానీ, ఆర్ ఎస్ ఎస్ భావజాలాన్ని పుణికి పుచ్చుకున్న నాయకులు మాత్రం జనసేన వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. సోము వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, మాధవ్, జీవీఎల్ నరసింహారావు వంటివారు.. జనసేన చేసిన 15 ఏళ్ల రాజకీయాలను సమర్థించకపోగా.. వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు.15 ఏళ్లపాటు సీఎంగా చంద్రబాబు మాత్రమే ఉండాలన్నది.. జనసేన వ్యక్తిగత అభిప్రాయమని.. అదికూట మి నిర్ణయం కాబోదని సోము వీర్రాజు బహిరంగ వ్యాఖ్యలే చేస్తున్నారు. ఇక, ఇతర నాయకులు మాత్రం అంతర్గత చర్చల్లో పవన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తావిస్తూ.. తమకు 15 ఏళ్లపాటు చంద్రబాబు అవసరం లేదని యువతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నది వారి మాటగా వినిపిస్తోంది. సో.. ఈ విషయంలో జనసేన ఒక నిర్ణయంతో ఉండగా.. పార్టీ కీలక నాయకులు భిన్నమైన వాదన వినిపిస్తుండడం గమనార్హం.

## పిల్లలకు చదువుతో పాటు సామాజిక బాధ్యత నేర్పాలి

**ఎంఈఓ పుష్పలత**

***డాన్ బాస్కో లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు***



**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 04 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని గుంటుపల్లి డాన్ బాస్కో (స్టేట్) స్కూల్ లో గ్రాడ్యుయేట్ డే శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు.యుకేజీ పూర్తి చేసుకొని మొదటి తరగతికీ వెళ్తున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం ఎంఈఓ పుష్పలత,కరెస్పాండంట్ జార్జి లు పాల్గొన్నారు. విద్యార్థులకు మెడల్ తో పాటు గ్రాడ్యుయేట్ పట్టా అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పిల్లలకు విద్యతోపాటు సామాజిక బాధ్యత నేర్పించాలని, తరగతి గదులలోనే కాకుండా బయట ప్రపంచం గురించి వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. నేటి బాల్యంలో వేసిన పునాదు లే వారి భవిష్యత్తుకు ఉపయోగపడతాయని, పిల్లలను అభివృద్ధి మార్గదర్శకాలుగా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్స్ విజయ్ ప్రకాష్, ఇన్నారెడ్డి సందీప్ రెడ్డి, ఫాదర్ సాగర్ లు మెడల్ తో పాటు గ్రాడ్యుయేట్ పట్టా అందజేశారు డాన్ బాస్కో క్యాంపస్ ఇంచార్జ్ వేళంగిణి రెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, తల్లీదండ్రులు,స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మ సూక్తి రత్నాలు



మభ్యపెట్టకు మాటలతో
మోసగించకు నటనలతో
బండారం బయటపడితే
తుదకు మిగిలేది అధోగతే
విసగించకు కోతలతో
గాయపరచకు చేతలతో
బంధాలకు పొడవకు తూట్లు
హద్దుమీరిన గర్వంతో
తలపెట్టకు అపకారము

విడిచిపెట్టకు ఉపకారము
ఆపద వేళ ఆశ్రయిస్తే
ఆపేయకు సహకారము
చేయకూడదు అవహేళన
చెందకూడదు ఆందోళన
పదిమందికి ఆదర్శము
పంచిపెట్టాలి ఆనందము

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు

# పశ్చిమ అభివృద్ధికి ఎమ్మెల్యే సుజనా చౌదరి నిరంతరం కృషి

**సీసీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమం లో అడ్డూరి శ్రీరామ్, ప్రత్తిపాటి శ్రీధర్**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నాలుగు స్తంభాల సెంటర్, 39వ డివిజన్ తణుకు వారి వీధిలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సుజనా చౌదరి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.పశ్చిమాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి లతో సమీక్షలు జరిపి నియోజకవర్గానికి అత్యధిక నిధులు వెచ్చించి అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే సుజనా చౌదరి కృషి చేస్తున్నట్లు తెలిపారు.తణుకు వారి వీధిలో సీసీ రోడ్డుకు రూ 11.77 లక్షలతో నిర్మాణం చేపట్టనున్నట్లు కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ తెలిపారు.కార్యక్రమంలో ఎన్డీఏ కూటమినేతలు రేగళ్ల లక్ష్మణ్, ఏలూరు సాయి శరత్, రాజీవ్ కృష్ణ, పచ్చిపులుసు ప్రసాద్, కప్పగంతుల శివశర్మ, రెడ్డిపల్లి రాజు, కొత్త మాసు పిచ్చయ్య, నెక్కట్ల రాజా, ఏలూరు వెంకన్న, రామాంజనేయులు, పీ ప్రసాద్ ,కాంట్రాక్టర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# దివంగత సీపీఐ మహిళా ఉద్యమ నేత గుజ్జుల సరళ దేవికి లాల్ సలాం

**సరళదేవికి నివాళులర్పించిన సీపీఐ మహిళా నేతలు**




**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మహిళా ఉద్యమ నేత దివంగత గుజ్జుల సరళదేవికి మహిళా నేతలుమహిళా సమాఖ్య నగర కమిటీ ఆధ్వర్యంలో దాసరి భవన్ వద్ద గుజ్జుల సరళా దేవి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు.ఆమె 27వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్ష కార్యదర్శులు ఓర్సు భారతీ, పంచదార్ల దుర్గాంబలు మాట్లాడుతూ గుజ్జుల సరళాదేవి విద్యార్థి దశ నుండే వామపక్ష భావాలతో ఉద్యమ బాటపట్టారని, “”కల్లు మానండోయ్ బాబు, కళ్ళు తెరవండోయ్ బాబు, వళ్ళు గుల్లగునోయ్ బాబు, కల్లు వల్ల శాంతి లేదంటూ బాబు”” . పాటతో ఊరూరా తిరిగి మహిళలను చైతన్య పరిచే వారిని గుర్తు చేశారు. 1936 గుంటూరు జిల్లా గురజాలలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మందపాటి నాగిరెడ్డి అన్న మందపాటి పేరిరెడ్డి లక్ష్మీదేవి దంపతులకు సరళ దేవి జన్మించారని చెప్పారు. బాల్యం నుండే, పువ్వు పుట్టగానే పరిమళించినట్టుగా కమ్యూనిస్టు ఉద్యమ త్యాగాల స్ఫూర్తితో సాంఘిక దురాచారాలకు, మద్యపానానికి వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేసే దిశగా అడుగులు వేశారని కొనియాడారు. ఈ క్రమంలో కల్లు వ్యతిరేక ఉద్యమం నడిపిన కమ్యూనిస్టు అగ్రనాయకుల్లో ఒకరైన గుజ్జుల ఎలమందరెడ్డితో వివాహం జరిగిందన్నారు. అనంతరం స్త్రీ, పురుష వేతన సంఘంలో నిరక్షరాస్యత, నిర్మూలన సంఘంలో ఆమె పనిచేస్తూ, వయోజన మహిళల కోసం కేవలం మూడు సంవత్సరాల్లో సుమారు 300 స్కూల్ నిర్వహించారని తెలిపారు. అంతేకాకుండా మద్యపాన నిషేధం, వరకట్న నిషేధం, దురాచారాలపై ఆమె పాటలు రాసి పాడేవారని, ఆమె నాయకత్వంలో కార్యకర్తలు ఊరూర తిరుగుతూ కళా ప్రదర్శన ఇచ్చేవారని, స్త్రీ ఆస్తిహక్కు, వివాహ రక్షణ హక్కు, వారసత్వ దత్తత స్వీకరణ హక్కు, మనోవర్తి హక్కుల సాధనకై ఉద్యమించారు. 33% రిజర్వేషన్ కోసం హైదరాబాదులో ఆమె నాయకత్వంలో జరిపిన ప్రదర్శనలు ప్రముఖమైనదన్నారు. పార్టీ ఉద్యమాల్లో భర్తతో ప్రముఖ పాత్ర పోషిస్తూ.. 1970లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి, నిర్మాణాన్ని పటిష్ట పరచడంలో ఆమె ప్రముఖ పాత్ర పోషించారన్నారు. 1994లో కురుక్షేత్రంలో జరిగిన 14వ జాతీయ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని దుర్గంభ తెలిపారు. ఉద్యమమే ఊపిరిగా జీవిస్తూ.. 1998 ఏప్రిల్ 4న అకాల మృతి, మహిళా ఉద్యమానికి తీరని లోటు అన్నారు. ఆమె పేరు మీద సింగ్ నగర్ లో కళ్యాణ మండపం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు తమ్మిన దుర్గ, నిలాపు భాగ్యలక్ష్మి, ఎస్ కె నాగుర్ బి, జి మణి కుమారి, పద్మ, నాగ మల్లేశ్వరి, దుర్గ, షైనీ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సాయి కుమార్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షు గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

# 6న శ్రీ నగరాల సీతారామస్వామి వార్ల కళ్యాణ మహోత్సవం

**7వ తేదీ సాయంత్రం పురవీధుల్లో రథోత్సవం**





**విజయవాడ పశ్చిమ మార్చి 4: (వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 6వ తేదీన కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి వార్ల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు (పిసి) చెప్పారు. శుక్రవారం రామాలయం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు కొత్తపేట బ్రాహ్మణ వీధిలో వేంచేసి ఉన్న శ్రీ నగరాల సీతారామస్వామి వారి బ్రహ్మోత్సవాస్తర్గత కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వివరించారు. దాదాపు 101 సంవత్సరాల క్రితం కొత్తపేటలో ఈ రామాలయం నిర్మాణం జరిగిందని, అలాగే భద్రాచలం రాముడి తరహాలోనే విగ్రహ రూపకల్పన జరిగిందని చెప్పారు. అలాగే 101 సంవత్సరాల క్రితం రూపొందించిన శ్రీ స్వామివారి రథం అనేక విశేషాంశాలను కలిగి ఉందని, రథం పైన ఉన్న జాకీ సాయంతో చక్రాలు అలాగే ఉంటే పైనున్న రథం అన్ని వైపులా తిరుగుతుందని చెప్పారు. ఇటువంటి రథం దేశంలో ఏ దేవస్థానానికి లేదని ,గతంలో ఏఐసిసి అధ్యక్షురాలుగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చూసి అభినందనలు తెలియజేశారని వారు వివరించారు. కాగా శ్రీరామనవమి సందర్భంగా నాలుగో తేదీన ఉదయం స్వామివారిని పెండ్లి కుమారుని చేసే కార్యక్రమం, 5వ తేదీన నిత్యార్చనలు, అగ్ని ప్రతిష్టాపన, గజవాహన సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. 6వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ నగరాల సీతారామస్వామి వారి కళ్యాణ మహోత్సవం విజయవాడ నగర ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరుగుతుందని చెప్పారు. 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు రథోత్సవం నగర పురవీధుల్లో జరుగుతుందని వివరించారు. 8వ తేదీన చూర్ణోత్సవం వసంతోత్సవం, వసంతోత్సవం పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 9వ తేదీన ఉదయం 10 గంటలకు భక్తులకు అన్న అన్నప్రసాద వితరణ జరుగుతుందని, అదే రోజు రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు, స్వామివారి పవళింపు సేవ, తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వారు వివరించారు. సమావేశంలో దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ళ సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శీరం వెంకటరావు,ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు, కమిటీ సభ్యులు పణుకు రమ, కామందుల నరసింహారావు, పిళ్ళా విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అనేక వ్యాధుల చికిత్సలో 'స్టెమ్ సెల్స్' పాత్ర కీలకం




**విజయవాడ పశ్చిమ, ఏప్రిల్ 4, (వార్తా ప్రభ ప్రతినిధి)**అనేక వ్యాధుల చికిత్సలో స్టెమ్ సెల్స్ విప్లవాత్మక పాత్ర పోషిస్తున్నాయని, అవయవ పునరుద్ధరణలో వీటి పాత్ర కీలకమని ప్రభుత్వ వైద్యకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.దుర్గా శ్రీలక్ష్మి అన్నారు. కెబిఎన్ కళాశాల బయోటెక్నాలజీ, ఎన్ ఎస్ ఎస్ విభాగాల సంయుక్త నిర్వహణలో శుక్రవారం స్టెమ్ సెల్స్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. దుర్గా శ్రీలక్ష్మి మాట్లాడుతూ రక్త సంబంధిత వ్యాధులు, న్యూరోడిజెనరేటివ్ సమస్యలు, గుండె సంబంధిత వ్యాధుల చికిత్సకు స్టెమ్ సెల్స్ ఉత్తమ పరిష్కారాలు అందిస్తాయన్నారు. రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడం, మరింత సమర్థవంతమైన కణ పునరుద్ధరణ పద్ధతులను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా స్టెమ్ సెల్స్ పై పరిశోధనలు జరుగుతున్నట్లు వివరించారు. శరీరంలోని గాయాల్ని తగ్గించుకోవడానికి, కణాలు పునరుత్పత్తి చేసుకోవడానికి స్టెమ్ సెల్స్ సహాయపడతాయన్నారు. స్టెమ్ సెల్స్ ను దానం చేయటం ద్వారా అనేక మంది జీవితాలను కాపాడే అవకాశం కలుగుతుందని, ఈ దిశగా సమాజంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండి, వాటి వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన, శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. ఆరోగ్యవంతమైన జీవన పద్ధతులు పాటిస్తూ, వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. హిందూ హై స్కూల్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్య సాధన దిశగా భారత ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎన్.సాంబశివరావు, శాంతిబాబు, గౌతమీదేవి, జి.సీతారత్నం, బయోటెక్నాలజీ విభాగాధిపతి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడిగా మారిన సంగం సీఐ వేమారెడ్డి



**సంగం, ఏప్రిల్ 04 (వార్తాప్రభ)** శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా సంగం లోని బీసీ బాలికల వసతి గృహాన్ని సీఐ వేమారెడ్డి సందర్శించారు. వసతి గృహం లో సీఐ వేమారెడ్డి ఉపాధ్యాయుడు గా మారారు. బుక్ చేత పట్టి విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ ను బోధించారు. ఇంగ్లీష్ గ్రామర్ ఎలా రాయాలో విద్యార్థుల చేత రాయించి. పలు సూచనలు సలహాలు తెలియచేశారు. సీఐ బోధిస్తున్న ఇంగ్లీష్ గ్రామర్ ను విద్యార్థులు శ్రద్ధగా విని బుక్ లో రాసుకున్నారు. వేసవి లో విద్యార్థులు ఫోన్లు వైపు మొగ్గు చూపకుండా ఇంగ్లీష్ పై దృష్టి సారించాలని సూచించారు. సమయాన్ని వృథా చేసుకోవద్దని తెలియచేశారు. కార్యక్రమంలో వార్డెన్ మల్లీశ్వరమ్మ, ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల కళ్యాణం కి రారమ్మని పోతిన మహేష్ కి ఆహ్వానం



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోనిశ్రీ నగరాల సీతారామస్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 6 న జరిగే కళ్యాణ మహోత్సవానికి రావాలంటూ పోతిన వెంకట మహేష్ కు శుక్రవారం ఆహ్వానం అందింది. దేవస్థాన కమిటీ అధ్యక్షులు లింగిపిల్ల అప్పారావు, సహాయ కార్యదర్శి సీరం వెంకట్రావు , ఆర్గనైజింగ్ కార్యదర్శి కొరగంజి భాస్కర రావు, కార్యవర్గ సభ్యులు పణుకు రమా , మరియు పిల్లా సూరిబాబు , రాంపిల్ల వాసు , తదితరులు పోతినను స్వయంగా కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

## శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై...... జగన్మాత కు ప్రత్యేక పుష్పార్చన'





**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వసంత నవరాత్రుల్లో ఆరవ రోజైన శుక్రవారం శ్రీ కనక దుర్గ అమ్మవారికి ప్రత్యేక పుష్పార్చన వైభవంగా జరిగింది.కాగడా మల్లెలు, జాజులు,మరువ ములతో నూతనంగా నిర్మించిన పూజా మండపం ( నటరాజ స్వామి ఆలయ ప్రాంగణం)లో ఉదయం 9 గంటల నుండి పుష్పార్చన వైభవంగా ప్రారంభమైంది.శ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రధాన ఆలయం నుండి పుష్పాలతో మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు నడుమ ఆలయ అర్చకులు, సిబ్బంది అర్చన ప్రాంగణంకి వెదురు బుట్టలతో పుష్పాలు తీసుకొని విచ్చేసిన అనంతరం ప్రత్యేక పూజలు ప్రారంభం అయ్యాయి. ఈ పుష్పార్చన కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## శ్రీ కనక దుర్గమ్మ వారికి వెండి పాత్ర సమర్పణ



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వరుల సేవలో వినియోగించే నిమిత్తం పూర్వ కృష్ణా జిల్లా కలెక్టర్ బి. లక్ష్మీ కాంతం 2 కిలోల 10 గ్రాముల వెండి 5 గిన్నెల నివేదన పాత్ర సమర్పించారు.శుక్రవారం ఉదయం దేవస్థానమునకు విచ్చేసి వెండి పాత్ర అందించారు.ఈ సందర్భంగా దాత, కుటుంబీకులకు శ్రీ అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు చేసి, చిత్రపటం, ప్రసాదాలను దేవస్థానం నుండి అందించారు.

## శ్రీరామనవమి ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలు చేస్తే కఠిన చర్యలు



**సంగం, ఏప్రిల్ 04 (వార్తాప్రభ)** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం పోలీస్ స్టేషన్లో ఎస్సై రాజేష్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ ఐపీఎస్, ఆత్మకూరు డివిజనల్ డిఎస్పి కే.వేణుగోపాల్ ఆదేశాలతో సంగం సర్కిల్ ఇన్స్పెక్టర్ వేమారెడ్డి సూచనలతో రానున్న శ్రీరామనవమి పండుగను ఉద్దేశించి పలు సూచనలు ప్రజలకు తెలియజేశారు. ఈనెల 6వ తేదీన శ్రీరామనవమి పండుగ సందర్భంగా పలు గ్రామాలలోని నిర్వాహకులు ఉత్సవాలు ఏర్పాటు చేస్తారని ఈ సందర్భంగా అనుమతులు లేకుండా ఈవెంట్స్ గాని అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్సులు వంటి పలు కార్యక్రమాలను నిర్వహించరాదని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు అదేవిధంగా ఉత్సవాల సందర్భంగా రికార్డింగ్ డ్యాన్సులు, డైమండ్ డబ్బా, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తాము. పవిత్రమైన శ్రీరామనవమి పండుగను వివాదాలు లేకుండా జరుపుకోవాలని ప్రజలను ఆయన కోరారు.

# విజయవాడ పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి పై సుజనా చౌదరి ఫోకస్

### నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి , పొంగూరు నారాయణ, సత్య కుమార్ లతో కలసి సమీక్ష





**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రత్యేక చర్యలను చేపడుతున్నారు. తన ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గ రూపురేఖలను మార్చేందుకు ప్రత్యేక దృష్టి సారించారు.మున్సిపల్ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ సంబంధిత అధికారులతో పశ్చిమ అభివృద్ధిపై తాడిగడప లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సుజనా ఫౌండేషన్ అడ్వైజర్ వేజెండ్ల శ్రీనివాసరావు పశ్చిమంలోని అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని చేయవలసిన అభివృద్ధి పనులను, ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు. కాళేశ్వరరావు మార్కెట్ వద్ద నిత్యం ఏర్పడే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని నైజాం గేటు వద్ద అండర్ పాస్, కేదారేశ్వరపేట నుంచి పాల ప్రాజెక్టు వరకు ఫ్లై ఓవర్ నిర్మాణం, మీసాల రాజారావు బ్రిడ్జి నుండి రైల్వే స్టేషన్ వరకు బీ ఆర్ టీ ఎస్ రోడ్డు విస్తరణ, షాదీ ఖానాల అభివృద్ధి, కొండ ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం, ఏలూరు కాలువ, బందర్ కాలువ గట్టుల సుందరీ కరణ స్ట్రామ్ వాటర్ డ్రైనేజీల నిర్మాణం ఇల్లు లేని నిరుపేదలకు టిడ్కో ఇల్లు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ ను కోరగా పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని అన్నారు.ఎంఎల్ఏ సుజనా చౌదరిమాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో మునిసిపల్, హెల్త్, ఎడ్యుకేషన్, ఎండోమెంట్ లో చేయగలిగిన అంశాలపై చర్చించామన్నారు.పి4 ను మొదలుపెట్టి అమలు చేసేలా విధానాలు తెచ్చారునియోజక వర్గం లోరోజువారీ సమస్యలు సుజన మిత్ర లు చేస్తారు.. అలాగే మేజర్ అన్ని అంశాలు మంత్రులు కూడా సహకారం చేస్తారు..వెస్ట్ ను బెస్ట్ గా చేస్తానని మాటిచ్చాను... చేస్తాను... చేసి చూపిస్తాను.ఇంద్రకీలాద్రి అభివృద్ధిపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి , ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ నిపుణులకు టెక్నికల్ టీం కనకదుర్గ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి చేపట్టబోయే పనుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ కనకదుర్గమ్మ ఆలయం, పశ్చిమ లోని ఇతర ఆలయాల అభివృద్ధికి నివేదిక సిద్ధం చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , దేవాదాయ శాఖ , ఎమ్మెల్యే సుజనా చౌదరి అందరం ఇంద్రకీలాద్రి అభివృద్ధికి పనిచేస్తున్నామన్నారు. భవిష్యత్తులో భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్ లో పలు సూచన చేసామన్నారు. కేంద్రం ఇచ్చే పథకాలను దృష్టిలో పెట్టుకొని ఐదు కోట్ల పైన రాబడి వచ్చే దేవాలయాలను అభివృద్ధి పరుస్తామన్నారు.. రెండో ఘాట్ రోడ్, మల్టీ లెవెల్ పార్కింగ్, క్యూలైన్ల ఆధునీకరణ , ఎలివేటెడ్ క్యూ లైన్ల నిర్మాణం తదితర అంశాలను ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామన్నారువైద్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రయత్నం చేస్తున్నారన్నారు. రోగులకు వైద్యం అందించే విషయంలో సుజనా చౌదరి చేసే ప్రయత్నాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థులు డిజిటల్ వ్యసనాలకు లోను కాకుండా నషా ముక్త్ విధానాన్ని ప్రవేశపెడుతున్నామన్నారు. పశ్చిమ లోని ప్రభుత్వ స్థలాలని గుర్తించి క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. . పశ్చిమ నియోజకవర్గం ప్రజలకు 12 యు హెచ్ సి లకు మెడికల్ అధికారులను సుజనా ఫౌండేషన్ అంబులెన్స్ లకు అనుసంధానం చేయడం గురించి పరిశీలిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను 50% ప్రజలకు పూర్తి చేశామని 1% అనుమానిత కేసులను గుర్తించామన్నారు. సుజనా చౌదరి ప్రారంభించబోయే సుజనా సంచార వైద్యశాలలకు పూర్తి సహకారం అందిస్తామని ఈ వినూత్న కార్యక్రమాన్ని పలు నియోజకవర్గాల్లో అమలు చేసేలా చర్యలు చేపడతామన్నారు.ఆయుష్ మీద కూడా ప్రత్యేక దృష్టి పెట్టామని ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ,ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, టిడిపి కార్య నిర్వాహ కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్ , కోగంటి రామారావు, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ బి పాండురంగారావు, సుజనా ఫౌండేషన్ ఆపరేషన్స్ హెడ్ వీరమాచనేని కిరణ్ , హరీష్, టెక్నికల్ టీం సభ్యులు బోరా శ్రీనివాస్ నాయుడు,విఎంసి, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులుసిబ్బంది పాల్గొన్నారు.

## 'పెగా'తో వేగంగా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్



**విజయవాడ పశ్చిమ, ఏప్రిల్ 4:(వార్తా ప్రభ ప్రతినిధి)**పెగా వంటి అధునాతన టూల్స్ వినియోగం ద్వారా డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ అత్యంత వేగంగా జరుగుతుందని, తద్వారా వ్యాపార సంస్థలు సమర్థమైన నిర్ణయం తీసుకునేందుకు వీలవుతుందని ప్రముఖ సాఫ్ట్ వేరు నిపుణుడు జి.పవన్ కల్యాణ్ అన్నారు. కెబిఎన్ కళాశాల కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న 'పెగా' కార్యశాల శుక్రవారం ముగిసింది. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్ కేర్, ఇన్స్యూరెన్స్, రిటైల్, టెలికామ్ రంగాల్లో 'పెగా' అనువర్తనాలు అత్యధికంగా ఉంటాయన్నారు. పెగా డెవలపర్, పెగా బిజినెస్ అనలిస్ట్, పెగా ఆర్కిటెక్ట్ వంటి ఉద్యోగ అవకాశాలు పారిశ్రామిక రంగంలో చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. కోడింగ్ అనుభవం తక్కువగా ఉన్నవారు కూడా వేగంగా అప్లికేషన్లు అభివృద్ధి చేయడానికి పెగా ఉపయోగిస్తుందన్నారు. క్లౌడ్, ఎ.ఐ, రోబోటిక్స్, కేస్ మేనేజ్మెంట్ వంటి అధునాతన టెక్నాలజీల సమాహారంగా పెగా రూపుదిద్దుకుందన్నారు. ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్ మాట్లాడుతూ 'పెగా' ఆవిష్కరణతో వర్తక, వాణిజ్య రంగాల్లో సమూలంగా మార్పులు వచ్చాయని, వీటిని అందిపుచ్చుకుంటూ విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ నిరంత అన్వేషణ, పరిశోధనల పట్ల అవగాహన ద్వారా విద్యార్థులు కెరీర్ ను ఉత్తమంగా మలచుకోవటం సాధ్యమవుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.జి.డైరెక్టర్ డాక్టర్ ఎస్.వేంకటేశ్, విభాగాధిపతి డాక్టర్ వి.టి.రామ్ పవన్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



**సంగం, ఏప్రిల్ 04 (వార్తాప్రభ)** శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా సంగం మండలంలోని స్థానిక సాయినగర్ లో టీడీపీ నాయకులు సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పూజలు నిర్వహించి అనంతరం సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల తో ప్రతీ వీధిలో సిమెంట్ రోడ్ నిర్మాణాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు.గ్రామాల్లో ఎక్కడా మట్టి రోడ్లు లేకుండా ఉండటమే లక్ష్యం గా మంత్రి ఆనం ఆదేశాల తో సిమెంట్ రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు. మున్ముందు కూటమి ప్రభుత్వం మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపీ మండల అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, టీడీపీ నాయకులు బాణా శ్రీనివాసులురెడ్డి, కాకు మధుసూదన్ యాదవ్, కర్నాటి చరణ్, కాకు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు చౌదరి, శ్రీనివాసులు నాయుడు, పృథ్వీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సీసాలు ధ్వంసం చేసిన కృష్ణాజిల్లా పోలీసులు

### నాటు సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం..... ఎస్పీ
### అక్రమ మద్యం సీసాలను ధ్వంసం చేసిన కృష్ణాజిల్లా పోలీసులు





**మచిలిపట్నం ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో అక్రమంగా వ్యాపారం నిర్వహిస్తూ, రవాణాకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడ్డ మద్యం సీసాలను శుక్రవారం మచిలీపట్నం పోలీస్ కార్యాలయంలో రోడ్డు రోలర్ తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమం కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు పర్యవేక్షణలో జరిగింది.బందరు ,గుడివాడ, అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 15,762 మద్యం మద్యం సీసాల విలువ దాదాపు 50 లక్షలు పై మాటేనని అంచనా వేశారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా ఎస్పీఆర్ గంగాధరరావు మాట్లాడుతూ ఎక్సైజ్, ఎన్ఫోర్స్మెంట్, జిల్లా పోలీసులు సంయుక్తంగా అక్రమ మద్యం సీసాలను ధ్వంసం చేశామని తెలిపారు. వివిధ కేసులలో పట్టుబడిన వారి నుండి మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని కోర్టుకు అప్పగించిన అనంతరం చట్ట పరిధిలో ధ్వంసం చేశామని తెలిపారు. అలానే జిల్లాలో అక్రమంగా నాటు సారా తయారీ, విక్రయ కేంద్రాలపై దాడులు నిర్వహించి పట్టుబడిన 684.4 లీటర్లు నాటు సారాను ధ్వంసం చేశామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మద్యం ,నాటు సారా అమ్మకాదారులకు పరివర్తన పేరుతో కొన్ని కార్యక్రమాలు నిర్వహించామని, నాటు సారా అమ్మకాలు చాలావరకు జిల్లాలో తగ్గాయని అన్నారు. అక్రమ మద్యం అమ్మకాలను నాటు సారా తయారీ, విక్రయాలను పూర్తిస్థాయిలో నిర్మూలించి నాటు సారా రహిత జిల్లాగా కృష్ణాజిల్లా ను తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తామని అన్నారు. అక్రమ మద్యం అమ్మకాలు నాటుసార తయారీ, విక్రయాలు కేంద్రాలు సంబంధిత సమాచారం ప్రజలకు తెలిస్తే వెంటనే కృష్ణాజిల్లా పోలీసులకు తెలియజేయాలని లేదా హెల్ప్ లైన్ నెంబర్14405-100,112 నెంబర్లకు డయల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వివి నాయుడు, అడిషనల్ ఎస్పీ ఏ ఆర్ సత్యనారాయణ, మచిలీపట్నం నగర డి.ఎస్.పి రాజా, గుడివాడ డి.ఎస్.పి ధీరజ్ నీల్, అవనిగడ్డ డి.ఎస్.పి శ్రీవిద్య, మచిలీపట్నం సీఐలు ఏసుబాబు, నబి, ఎస్సై నాగరాజు, ఏ ఆర్ ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో యు/ఎస్ 163 భారతీయ నాగరిక సురక్ష సహిత - 2023 (బి ఎన్ ఎస్ ఎస్ ) క్రింద నిషేధాజ్ఞలు
### ఈ నెల 4 నుండి వచ్చే నెల 24 వరకూ అమలు




**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజా జీవనానికి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ నెల 4 నుండి వచ్చే నెల 23 వరకూ నిషేధఘ్నలు అమల్లో వుంటాయని సి పి రాజశేఖర్ బాబు శుక్రవారం ఓ ప్రకటన లో పేర్కొన్నారు. సజావుగా శాంతిభద్రతలు కాపాడటానికి పోలీస్ కమిషనర్, మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.వి.రాజ శేఖర బాబు నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 4తేదీ నుండి మే 23 తేదీ వరకు యు/ఎస్ 163 భారతీయ నాగరిక సురక్ష సహిత -2023 (బి ఎన్ ఎస్ ఎస్ ) క్రింద నిషేధాజ్ఞలు విధించారు.నిషేధాజ్ఞలు అమలులో ఉన్న సమయంలో పోలీస్ కమీషనరేట్ పరిధిలోని ఇబ్రహింపట్నం, భవానిపురం, వన్ టౌన్, టూటౌన్, ఎస్.ఎన్.పురం, ఏ.ఎస్.నగర్, నున్న, గవర్నర్ పేట, సూర్యారావు పేట, కృష్ణలంక, మాచవరం, గుణదల మరియు పటమట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకుమించి ఎక్కువ మంది జనం బహిరంగ ప్రదేశాలలో గుమిగూడరాదు, కర్రలు,రాళ్ళు మరియు యితర మారణాయుధాలు పట్టుకుని తిరగరాదని ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు.

## బంగారు ఆభరణం తో ఉడాయించిన దొంగ




**మచిలిపట్నం ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నూతనంగా ఏర్పాటు చేసిన మలబార్ గోల్డె అండ్ డైమండ్స్ షో రూమ్ లో దొంగతనం జరిగింది. గురువారం మధ్యాహ్నం ముఖానికి మాస్క్ ధరించుకొని వచ్చిన ఓ గుర్తు తెలియని అగాంతకుడు కస్టమర్ గా షోరూం కు వచ్చాడు. అక్కడున్న ఆభరణా వస్తువుల వివరాలు తెలుసుకున్నట్లు నటించి సేల్స్ బాయ్ ను మాటలలో ఉంచి 31 గ్రాముల ఆభరణం ను అపహరించాడు. దొంగతనం ను అక్కడ ఉన్న సిబ్బంది గ్రహించలేకపోయారు. దొంగతనం చేసిన ఆభరణంతో అక్కడి నుండి ఆ అగాంతకుడు ఉడాయించాడు.అపహరించుకుపోయిన బంగారు ఆభరణం విలువ దాదాపు 5 లక్షల రూపాయలు అని అంచనా వేస్తున్నారు.( ఆభరణం విలువని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యాజమాన్యం ధ్రువీకరించాల్సి ఉంది). విలువైన బంగారు ఆభరణం కనిపించకపోవడంతో షోరూమ్ సిబ్బంది ఒక్కసారిగా షాక్ తిన్నారు. సదరు విషయాన్ని మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మేనేజర్ సీసీ ఫుటేజ్ ఆధారంగా ఆభరణం గుర్తు తెలియని వ్యక్తి అపహరించారని గ్రహించారు. వెంటనే తేరుకొని మచిలీపట్నం ఆర్ పేట పోలీస్ స్టేషన్ లో మేనేజర్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సిసి టీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

## నేటి పిల్లలే రేపటి పౌరులు... డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి సృజన

### విద్యార్థుల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన ఎంతో అవసరం- అకౌంట్ ఆఫీసర్ బి సత్యనారాయణ మూర్తి




**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ సృజన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, విద్యార్థులకు చిన్నతనంలోనే సింగిల్ యూస్ ప్లాస్టిక్ అనర్థాలు పై అవగాహన కల్పించేందుకు వివిధ వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, ఫాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించి వారిలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ చిన్నపిల్లల్లో చైతన్యం కల్పించడం ద్వారా వారు వారి తోటి మిత్రులకు, తల్లిదండ్రులకు, అవగాహన కల్పిస్తారని వారి ద్వారా సమాజానికి సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం పై అమూల్యమైన సందేశం వెళ్తుందని తెలిపారు.వివిధ రకాల పోటీలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డాక్టర్ జి సృజన, అకౌంట్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, న్యాయ నిర్ణయతలగా వ్యవహరించారు.

## పి యం. శ్రీ పనులను పరిశీలించిన ఎంఈఓ





**అనుమసముద్రంపేట ఏప్రిల్ 4 (వార్తాప్రభ)** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని జడ్పీ హైస్కూల్లో జరుగుతున్న పీఎం శ్రీ పనులను ఎంఈఓ 2 డి సాయి ప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంఈఓ సాయి ప్రసాద్ మాట్లాడుతూ పి యం శ్రీ పేస్ -1 క్రింద ఎంపికైన ఏఎస్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాలలో పి యం శ్రీ క్రింద పాఠశాల కు వచ్చిన నిధుల వినియోగం గురించి ప్రధానోపాధ్యాయులు వివరించడం జరిగినది.ఈ మేరకు పాఠశాల ఆవరణలో జరుగుతున్న గ్రౌండ్ లెవెలింగ్ ప్లే ఫీల్డ్ క్రింద ఏర్పాటు చేస్తున్న కోర్టులు పర్యవేక్షణ చేసారు. మరియు నూతనంగా మంజూరు చేసినటువంటి విద్యార్థులతో ఏర్పడిన స్కోట్స్ గైడ్స్ యూనిట్స్ ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలోప్రధానోపా ధ్యాయులు జి హరికృష్ణ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సి.ఆర్.ఎంటి ఎండి రఫీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## తమ్మి రెడ్డి శివశంకర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు



**విజయవాడ పశ్చిమ, మార్చి 4,(వార్తా ప్రభ ప్రతినిధి):** ఏపీ ఎంఎస్ఎంఈ డిసి నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియచేసారు. జనసేన పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సీనియర్ నాయకులు అజయ వర్మ ఠాగూర్, జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి రావుల రాజేంద్రప్రసాద్,ఎస్ టి ట్రైకర్ డైరెక్టర్ మద్దెల రామకృష్ణ,జనసేన పార్టీ సభ్యులు సజ్జ కాటయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లౌకిక విలువలను,మైనారిటీల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

### వక్ఫ్ సవరణలకువ్యతిరేక మస్జీద్ వద్ద సిపిఎం కరపత్రాలు పంపిణీ



**ఇబ్రహీంపట్నం,ఏప్రిల్ 04 (వార్తా ప్రభ ప్రతినిధి):** తన హిందూత్వ మతోన్మాద ఎజెండా అమలులో భాగంగా బిజెపి కేంద్ర ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తున్నదని లవ్ జిహాద్, ఘర్వాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం, మూక హత్యలతో హిందుత్వ శక్తులు తలపడుతున్నాయి. ఇప్పుడు సరికొత్తగా వర్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలు ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టింది. ఈ చట్టం ఆస్తుల కబ్జా చేయడానికి తప్ప, వక్ఫ్ ఆస్తులు అభివృద్ధికి కాదు. దుర్మార్గమైన సవరణలు చేస్తూ ముస్లిం ప్రజల ఆస్తులపై యుద్ధం ప్రకటించే ఈ బిల్లును లౌకిక పార్టీలుగా చెప్పుకునే టిడిపి, జనసేన తో సహా మరికొన్ని పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాలకై బలపరచడంతో నిన్న ఈ బిల్లు ఆమోదం పొందింది. టిడిపి జనసేనల వైఖరి లౌకికత్వానికి విఘాతం కలిగించాయి. సిపిఎం సహా ప్రతిపక్షాలు ఈ బిల్లును పార్లమెంటులో గట్టిగా ఎదుర్కొన్నాయి.ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులు శాశ్వతంగా వర్ఫ్ ఆస్తులుగా ఉంటాయని వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికి లేదని సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడింది. భారత రాజ్యాంగంలోని 25,29,30 తదితర నిబంధనకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడింది. మసీదులు, దర్గాలు, స్మశానాలు ఇప్పుడు మరింత ప్రమాదంలో పడతాయి.లక్షల ఎకరాల వక్ఫ్ ఆస్తులు కొల్లగొట్టబడతాయి. ఇతర మతాలవారు వక్ఫ్ బోర్డుల్లో సభ్యుల్లో చేర్చి వాటిని వివాదాస్పదం చేసే కుట్ర ఈ సవరణ బిల్లులో ఉన్నది. ఇది భారత ప్రజలను మతపరంగా విభజించే కుట్రలో భాగంగా చేయబడింది. దీన్ని వ్యతిరేకించాలి. ప్రతిఘటించాలి. ఇది కేవలం ముస్లింలే కాదు మొత్తం లౌకిక శక్తులు సమైక్యంగా ముందడుగు వేయాలని సిపిఎం కోరుచున్నది.భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి యం మహేష్, కమిటీ సభ్యులు ఎస్ కె బాషా, పార్టీ సభ్యులు ఎన్ బాబ్జీ, ముస్లిం మైనార్టీ పెద్దలు అజ్మతుల్లా , రషీద్, బషీర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుడి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణం బలి

## సెలవు దినాలలో అందని స్కానింగ్ రిపోర్టులు

**మచిలిపట్నం ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యుని నిర్లక్ష్యం ఒక నిండు ప్రాణంను బలిగొన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రావటమే ఆ కుటుంబానికి శాపమా? లేక పేదవారు కావడమే పాపమా? ప్రభుత్వ ఆసుపత్రులు పేదవారు దేవాలయాలు గా భావిస్తారు. పేదవారిని ప్రభుత్వ ఆసుపత్రిలో కొంతమంది వైద్యులు పట్టించుకోవడం లేదు అని విమర్శలు కూడా బాగానే వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు అంకిత భావంతో పనిచేయాల్సి ఉండగా కొందరు వైద్యులు పనితీరు జీతం కోసం మాత్రమే విధులు నిర్వహిస్తున్నట్లుగా ఉంది. ఒక పేదవాడికి మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందించిన విధానం అతనికి యమపాశం గా మారింది. ఎంతటి రోగానైనా తగ్గిస్తారు, ఎంతటి అత్యవసర చికిత్స అయినా వైద్యులు ఉచితంగా అందించి పేదవారిని బతికిస్తారు అనే ఆశతో వచ్చిన ఆ పేద కుటుంబానికి పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చింది. సేకరించిన సమాచారం ప్రకారం మచిలీపట్నం మండలం నవీన్ మిట్టల్ కాలనీ లో కట్ట నాగమల్లేశ్వరరావు కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఇతను ఒక పేద కుటుంబానికి చెందిన వ్యక్తి. ప్రతిరోజు కుటుంబ పోషణ నిమిత్తం ట్రాక్టర్ డ్రైవర్ గా విధులు నిర్వర్తిస్తూ ఉంటాడు. ఆ కుటుంబానికి అతడే ఆధారం, అతనిపై నలుగురు ఆధారపడి జీవనం కొనసాగిస్తూన్నారు. ప్రతిరోజు ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేయనిదే ఆ ఇంట్లో జీవనం సాగదు. అతను రోజువారి తీసుకువచ్చే కూలి డబ్బులే ఆ కుటుంబానికి పోషణ. ఇటీవల కాలంలో ఒక్క నెల రోజుల నుండి రుస్తుంబాద్ కు చెందిన గౌతమ్ అనే యజమాని దగ్గర కూలి డ్రైవర్ గా పనిచేస్తూన్నాడు.ప్రతిరోజు లాగానే గత శనివారం ట్రాక్టర్ యజమాని మల్లేశ్వరరావు ఇంటి వద్దకు వచ్చి అతనిని పనికి తీసుకువెళ్లాడు. కొన్ని పనులు అప్ప చెప్పిన ట్రాక్టర్ యజమాని ట్రాక్టర్ ను నాగమల్లేశ్వరరావు కు ఇచ్చాడు. ఆ ట్రాక్టర్ ను నాగమల్లేశ్వరరావు నడుపుకుంటూ జిల్లా పరిషత్ నుండి చిలకలపూడి సెంటర్ మార్గంలో వస్తూ ఉండగా మార్గం మధ్యలో ట్రాక్టర్ ముందు చక్రం ఊడి పడింది. ట్రాక్టర్ డ్రైవర్ గా ఉన్న కట్ట నాగమల్లేశ్వరరావు ట్రాక్టర్ మీద నుంచి కింద పడగా తలకు బలమైన గాయం అయింది. ఈ ఆక్సిడెంట్ (ప్రమాదం) ను గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులతో పాటు ట్రాక్టర్ యజమాని కూడా ఆసుపత్రికి వచ్చాడు. తలకు గాయమైన నాగమల్లేశ్వరరావు ను ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. క్షతగాత్రుడను చూసిన వైద్యుడు గాయానికి 15 కుట్లు



వేశారు. సీటీ స్కాన్ పరీక్షలు చేశారు. ఇక్కడ వరకు అంతా బాగానే ఉంది అసలు ట్విస్ట్ ఇక్కడే మొదలయ్యింది. తలకు గాయమైన నాగమల్లేశ్వరరావును ఇంటికి తీసుకువెళ్లవచ్చు అని డాక్టర్ కుటుంబ సభ్యులకు సూచించారు. డాక్టర్ మాటలు నమ్మిన కుటుంబ సభ్యులు నాగమల్లేశ్వరరావును ఇంటికి తీసుకు వెళ్ళారు. ఇంటికి వెళ్లిన అనంతరం అతని ఆరోగ్యం గంట గంటకు క్షీణిస్తూనే ఉండటాన్ని కుటుంబ సభ్యులు గ్రహించలేకపోయారు. వైద్యుడు బాగానే ఉంది అని చెప్పడం తో గాయం మానుతుంది లె అని కుటుంబ సభ్యులు అనుకున్నారు. కానీ మరుసటి రోజు (ఆదివారం) అతను ఆ గాయం కారణంగా కోమాలోకి వెళ్ళగా కుటుంబ సభ్యులు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి మరలా తీసుకువెళ్లారు. ఆసుపత్రి సిబ్బంది విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి చెందాడు. తలకు బలమైన గాయమై 15 కుట్లు వేసిన వైద్యుడు బాధితుడను వైద్యుని పర్యవేక్షణలో ఉంచకుండా డిస్చార్జ్ చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. ఎమర్జెన్సీ కేసులో స్కానింగ్ పరీక్షలు అప్పటికప్పుడు చేసి రిపోర్టులు ఇవ్వాలి. కానీ స్కానింగ్ చెపించుకుని సోమవారం 8 నెంబర్ ఓపికి వెళ్లాలని సూచించడం, ఈ నిర్లక్ష్యమే బాధితుడను మృత్యు వడికి చేర్చింది. పేదవారు కావటం, కుటుంబ సభ్యులు చదువుకోకపోవడం వైద్యుడు చెప్పింది నిజమేనని నమ్మటమే వీరు చేసిన అతి పెద్ద తప్పు. తలకు బలమైన గాయమై 15 కుట్లు పడిన వ్యక్తిని ఆసుపత్రి నుండి ఎలా డిస్చార్జ్ చేస్తారు? స్కానింగ్ రిపోర్టు తల లో బ్లీడింగ్ అని చూపించిన రిపోర్ట్ వెంటనే డాక్టర్ వద్దకు ఎందుకు పంపలేదు. హడావిడిగా కట్ట నాగమల్లేశ్వరరావు ట్రాక్టర్ యజమాని డిశ్చార్జ్ ఎందుకు చేయమన్నాడు. ఇలా మృతుని కేసులో అనేక సందేహాలు కలుగుతున్నాయి. వైద్యుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కట్ట నాగమల్లేశ్వరరావు మృతికి కారణమని కుటుంబ సభ్యులు తమ ఆవేదన



వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

**మంత్రి కొల్లు రవీంద్ర ఆదుకోవాలి** కట్ట నాగమల్లేశ్వరరావు మృతితో కుటుంబ సభ్యులకు జీవనాధారం పోయింది. తనపై ఆధారపడిన కుటుంబ సభ్యులు రోడ్డుపై పడ్డారు. ఇటీవల పదవ తరగతి పరీక్షలు పూర్తిచేసుకుని ఇంటర్మీడియట్ చదవాలన కోరిక తండ్రి మరణంతో ఆగిపోయిందని తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఆ విద్యార్థి ఆశలు తండ్రి మరణంతో ఆవిరైపోయాయి. ఆ విద్యార్థిని పెద్ద మనస్సుతో మంత్రి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కట్ట నాగమల్లేశ్వరరావు పై ఆధారపడిన నలుగురు వ్యక్తులను మంత్రి కొల్లు రవీంద్ర ఆదుకోవాలని, ఆ కుటుంబానికి జీవనాధారం చూపించాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరుతున్నారు

## ఓపిక ఉన్నంత వరకు కాదు, ఊపిరి ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీకి విధేయతతోనే ఉంటా

### ఆంధ్రప్రదేశ్ యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ జి.నరసింహ యాదవ్









**తిరుపతి :ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అమరావతిలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన జి.నరసింహ యాదవ్ శుక్రవారం ఉదయం తిరుపతికి రావడంతో ఆయనకు కూటమి శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు.స్థానిక బాలాజీ కాలనీలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, అండమాన్ నికోబార్ దీవుల అధ్యక్షులు మానిక్యాలరావు యాదవ్ ,సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత, తిరుపతి ఇంచార్జ్ సుగుణమ్మ విచ్చేసి జి.నరసింహయాదవ్ కు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం టౌన్ క్లబ్ కూడలిలో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఆతరువాత అక్కడి నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రకాశం రోడ్డు, కృష్ణాపురం ఠాణా, గాంధీ రోడ్డు, నాలుగళ్ళ మండపం, బండ్లవీధి, పెద్దకాపువీధి, తాతానగర్, తుడా ఆఫీసు మీదుగా కచ్ఛపి సమావేశ మందిరంకి చేరుకున్నారు. నగరంలో జరిగిన భారీ ర్యాలీలో కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కచ్ఛపి లో యాదవ కుటుంబ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నరసింహ యాదవ్ ను గజమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పునాదులని, కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ తెలిపారు.43 సంవత్సరాలుగా తమ కుటుంబం టీడీపీకి వీర విధేయతతో ఉందని,తాము ఎప్పుడు పదవులు కోసం కాకుండా పార్టీ పురోభివృద్ధి కోసం పనిచేసమని తెలిపారు. ఈ ర్యాలీలో టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కృష్ణాపురం టానా జంక్షన్ లో తెలుగుదేశం పార్టీ నాయకులు జేబీ శ్రీనివాస్ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో గుమ్మడికాయలు దిష్టి తీసి స్వాగతించడం జరిగింది, అనంతరం గాంధీ రోడ్డు పూలమఠం దెగ్గర జనసేన పార్టీ కార్పొరేటర్ ఎస్కే బాబు మరియు ఇతర కార్పొరేటర్ లు ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించడం జరిగింది, నాలుగు కాళ్ల మండపం దగ్గర పెద్దాపురం వీధి, యాదవ వీధి సంబంధించిన తెలుగుదేశం పార్టీ నాయకులు గాలం గుణశేఖర్, నాగేశ్వరరావు యాదవ్ స్వాగతించారు, బండ్ల వీధిలో పులిగోరు మురళీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున స్వాగతం పలకడం జరిగింది, పెద్ద కాపు వీధి జంక్షన్ వద్ద హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున స్వాగతించడం జరిగింది, కృష్ణ యాదవ్ యశ్వంత్ రెడ్డి గంగమ్మ గుడి దగ్గర అన్న రామచంద్ర యాదవ్, అన్నా రామకృష్ణ యాదవ్, అన్న అనిత యాదవ్, శంకర్ యాదవుల

## చిత్తలూరులో రీసర్వే పై అవగాహన ర్యాలీ

**చేజర్ల ఏప్రిల్ 04 (వార్తాప్రభ)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము చేపట్టిన రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం మండలంలోని చిత్తలూరు గ్రామము నందు చేజర్ల మండల తహశీల్దారు బి.మురళి ఆధ్వర్యంలో రీ సర్వే పై గ్రామసభ నిర్వహించడం జరిగింది. చిత్తలూరు గ్రామంలో రైతులకు ప్రజలందరికీ రీ సర్వే పై అవగాహన ర్యాలీని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల ఆర్ ఐ వెంకటేశ్వర్లు రెవెన్యూ సిబ్బంది చిత్తలూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.




## 8న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 (వార్తా ప్రభా ప్రతినిధి):** మండల పరిధిలో బీసీ, ఈబీసీ, కమ్మ, వైశ్య కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 8న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సునీత శర్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రెండు జతల అప్లికేషన్ ఫారంలు, రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్ పోర్టు ఫోటోలు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ తో 8వ తేదీ ఉదయం 10 గంటలకు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

## మంత్రి కొలుసు పార్థసారథిని సత్కరించిన తాళ్లూరి గిరినాయుడు



**ఆత్మకూరు ఏప్రిల్ 04 (వార్తాప్రభ)** నెల్లూరు పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మరియు సమాచార శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ మరియు ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వారి నివాసంలో మంత్రి కొలుసు పార్థసారథిని ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మరియు నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.ఈ సంధర్బంగా ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న గృహ నిర్మాణాలకు సంబంధించి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తో కలిసి వివరించారు.ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ జనసేనకే ఖరారు

### ఛైర్మన్ గా భీముని అనంతలక్ష్మి



**పెడన ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పెట్టమార్కెట్ యార్డ్ ఛైర్మన్ గా భీముని అనంత లక్ష్మి నియమితులయ్యారు. పెడన మండలం ఉరివి గ్రామానికి ఈమె మనవరాలు. అంటే అమ్మమ్మ వూరు అన్నమాట. అలాగే నియోజకవర్గ నలుమూలల బంధుత్వాలు ఉన్నాయి. ఆమె బందరులో సోదరుడు జనసేన పార్టీ నాయకుడు వికృతి శ్రీనివాస్ (కొరియర్ శ్రీను ) తో వుంటున్నారు. భర్త చనిపోయారు. చదువు వచ్చి ఉరివి గ్రామ మాజీ సర్పంచ్ దొండపాటి వారికి ఈమె కూతురు వరస అవుతారు. బాయిరెడ్డి వారి మనవరాలు. ఈమె కుమారుడు హైదరాబాదులో జాబ్ చేస్తున్నారు.డిగ్రీ డిస్ కంటిన్యూ చేశారు. 48 సంవత్సరాల గృహిణి. కాగా అనంతలక్ష్మి నియామకం టిడిపి వారికి షాక్ ఇవ్వగా స్థానిక జనసేన నాయకులకు మింగుడు పడటం లేదు.

## అమరావతి చిత్రకళ వీధికి రాజమండ్రిలో ఘన ఆరంభం



**రాజమండ్రి, ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈ ఏడాది అమరావతి చిత్రకళ వీధి కార్యక్రమం రాజమండ్రిలో అద్భుతంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, మంత్రి కందుల దుర్గేశ్ , ఎంఎల్ఏ ఆదిరెడ్డి వాసు , ఎంఎల్ఏ బత్తుల బాలరామకృష్ణ , మరియు ఏపీ సాంస్కృతిక సంఘం చైర్‌పర్సన్ తేజస్వి పోడపాటి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుండి 600 మందికి పైగా కళాకారులు హాజరై, తమ అద్భుతమైన కళా ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. చిత్రలేఖనాలు, పటచిత్రాలు, మట్టి బొమ్మలు, సాంకేతిక కళారూపాలు మొదలైన అనేక కళారూపాలు ప్రజల్ని ఆకట్టుకుంటున్నాయి.సంఘటన ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై, కళాకారులకు ఆదరణ తెలుపుతున్నారు. కుటుంబాలతో, విద్యార్థులతో వచ్చిన సందర్శకులు కళలపై ఆసక్తి కనబరిచారు. కార్యక్రమం కళలు పట్ల ప్రజల్లో అవగాహన పెంచడమే కాకుండా, యువ కళాకారులకు ప్రోత్సాహం కల్పించే వేదికగా నిలుస్తోంది.ఈ తరహా కార్యక్రమాలు రాష్ట్ర సాంస్కృతిక ప్రాధాన్యతను పెంచడంలో కీలకంగా ఉంటాయని, రాష్ట్ర సాంస్కృతిక సంఘం చైర్‌పర్సన్ తేజస్వి గారు చెప్పారు.

## పి ఎస్ అర్ ఇంజనీరింగ్ కళాశాల్లో మార్కెట్ మేకర్స్ పోటీ




**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(అటానమస్) కళాశాలలోని మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలోశుక్రవారం “మార్కెట్ మేకర్స్” పోటీ నిర్వహించారు. ఈ పోటీ 2023-2025, 2024-2026 బ్యాచ్ యం.బి.ఏ విద్యార్థుల కోసం ఏర్పాటు చేయబడింది.ఈ కార్యక్రమం మేనేజ్మెంట్ విద్యార్థులకు వారి ఉత్పత్తులను ధర, లక్షణాలు, బ్రాండింగ్‌మరియు మార్కెటింగ్ వ్యూహాల ద్వారా ఎలా భిన్నంగా ఉంచాలో నేర్పించడంలో సహాయపడిందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ డాక్టర్ సి.ఎ. చిట్టా అమర్ సుధీర్ , ప్రిన్సిపాల్ డాక్టర్‌యస్. శరవణ కుమార్, యం.బి.ఏ విభాగాధిపతి డాక్టర్ యస్ మణికంఠ , ఫ్యాకల్టీకోఆర్డినేటర్ ఎస్. ప్రవీణ్ హాజరై, పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.పోటీకి డా. ఎ. పతంజలి శాస్త్రి (వైస్ ప్రిన్సిపల్ %ఁ% హెచ్.ఓ.డీ – యం.సి.ఏ) మరియు డాక్టర్ వి.విజయ దుర్గా ప్రసాద్ (యం.బి.ఏ విభాగ ప్రొఫెసర్) న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలు మరియు రన్నరప్లకు డాక్టర్ ఎస్. శరవణ కుమార్, ప్రిన్సిపల్ మరియు యం.బి.ఏ విభాగాధిపతిడాక్టర్ యస్. మణికంఠ బహుమతులు అందజేశారు.

## రమ్యా కీర్తన కు షిరిడి సాయి బాబా విగ్రహ ప్రతిష్ట ఆహ్వానం



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 04(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి ‘బి’ కాలనీ వద్ద నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ షిరిడి సాయినాధుని గుడి లో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం లో పాల్గొనవలసిందిగా కోరుతూ శుభ పత్రిక అందజేశారు ఆలయ కమిటీ సభ్యులు.శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను ఆమెకు అందించారు. ఈ కార్యక్రమంలో గుడి కమిటీ సభ్యులు పామర్తి.రాంబాబు కోనంకి, రవి, మాజేటి. జవహర్ లాలు, బాలు, బుల్లి రామయ్య, నాగమణి, మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## మతసామరస్యానికి వేదికగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిలవాలి

***సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా***

***అల్తాఫ్ బాబా కు శ్రీ షిరిడి సాయిబాబా నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వానం అందజేసిన కమిటీ సభ్యులు***



**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 04 (వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి బీ కాలనీ వద్ద నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ షిరిడి సాయినాధుని గుడి లో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం మతసామరస్యానికి వేదికగా నిలవాలని, ఈ మహోత్సవంలో కుల మతాల అతీతంగా భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా. శుక్రవారం హజ్రత్ సయ్యద్ షాబుఖారి బాబా ఆస్థాన లో విగ్రహ ప్రతిష్ట శుభ పత్రికను అల్తాఫ్ బాబా కు అందజేశారు కమిటీ సభ్యులు.శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఎళ్లుగా ఎదురు చూస్తున్న సాయిబాబా గుడి నిర్మాణం పూర్తవటం సంతోషకరమని, సాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవ సందర్భంగా 13 న వేలమందికి అన్నదాన కార్యక్రమం జరుగుటం శుభపరిణామం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గుడి కమిటీ సభ్యులు పామర్తి.రాంబాబు కోనంకి, రవి, మాజేటి. జవహర్ లాలు, బాలు, బుల్లి రామయ్య, నాగమణి, మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రెడ్డిగూడెం లో ఘనంగా బేతేలు చర్చి ప్రారంభోత్సవం



**రెడ్డిగూడెం ఏప్రిల్ 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలం కేంద్రంలో బేతేలు చర్చి ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. గాస్పెల్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, బిషప్ బి ఏసుపాదం రిబ్బన్ కత్తిరించి మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీర్తిశేషులు ప్రత్తిపాటి ఇస్సాకు – ఎలిజబెత్ వారిచే స్థాపించిన సంఘానికి వారి కుమారుడు ప్రత్తిపాటి పాల్ఇమ్మానుయేలు – సుష్మా షారోను దంపతుల చే ఒక శాశ్వత మందిరం నిర్మాణం పూర్తి కావడం దైవ సంకల్పం అని అన్నారు. ఈ మందిరం అనేక ఆత్మల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రార్థనా మందిరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కె రత్నాకర్, కె ఎహెస్టేల్, ఆదాంఎలీషా, రెవ జి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కోలుకుంటున్న కొడాలి నాని.. ముంబయిలోనే మరో నెల రోజులు

● వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు మండలి..



**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వర రావు(నాని)కు ముంబయిలోని ఏషియన్ హార్ట్ కేర్ ఇన్స్టిట్యూట్లో ఈ నెల 2న నిర్వహించిన బైపాస్ సర్జరీ విజయవంతమైనట్లు వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. "ఆసుపత్రి చీఫ్ సర్జన్ రమాకాంత్ పాండే సుమారు 8 నుంచి 10 గంటల పాటు (బుధవారం రాత్రి 8 గంటల వరకు) శస్త్ర చికిత్స చేశారు. కొన్ని రోజులపాటు నాని.. ఐసీయులో వైద్యుల పర్యవేక్షణలో ఉంటారని తెలిపారు. ఆయన అవయవాలన్నీ బాగా స్పందిస్తున్నాయని వైద్యులు ధ్రువీకరించారు. అయితే మరో నెల రోజులపాటు నాని ముంబయిలోనే ఉంటారు. వీలైనంత త్వరగా ఆయన కోలుకుని తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నాం" అని మండలి పేర్కొన్నారు.

## రక్తదానము చేయండి.. ప్రాణాలు కాపాడండి..

-కొనకళ్ళ సీతయ్య చారిటబుల్ ట్రస్ట్



**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** బిల్లపాడు గ్రామ నివాసి పల్లము శ్రీ రేఖ (వయసు 21 సంవత్సరాలు) రెండో కాన్పు నిమిత్తం మూడో తేదీన గుడివాడ ఏరియా హాస్పిటల్ లో చేరినది డాక్టర్లు వారంలో డెలివరీ క్రమంలో రక్తము తక్కువగా ఉన్నదని.. ఒపాజిటివ్ రక్తము కావాలి ఈలోపు ఎక్కించాలి తెచ్చుకోమన్నారు. రెండు రోజులు ఎవరిని అడగాలో తెలియలేదు బిల్లపాడు ఆశ కార్యకర్త నా అడ్రస్ తేల్చుకొని నాకు ఫోన్ చేసి వివరములు తెలియజేసినట్లు కొనకళ్ళ సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ళ సీతయ్య గుడివాడ పేర్కొన్నారు. వెంటనే మాట్రస్సు సభ్యుడు గుడివాడ పట్టణ యువజన సంఘము అధ్యక్షుడు బెజవాడ బాజేశ్వరరావు వెళ్లి రక్త దానము చేశారన్నారు. పేషంట్ కి ఆపరేషన్ చేసి కాన్పు చేయడానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా జరిగినట్లు తెలిపారు. సకాలంలో రక్త దానము చేసిన బాజేశ్వరావుని శ్రీరేఖ కుటుంబ సభ్యులు, పట్టణ యువజన సంఘం వారు పలువురు అభినందించారు. ప్రతి ఒక్కరు రక్తదానము చేయండి ప్రాణాలు కాపాడండి.. రక్తదానము చేయాలనుకునేవారు మీ పేరు ఫోన్ నెంబరు ఈ ఫోన్ నెంబరు కు 93 46 33 49 54 తెలియపరచాలనీ సీతయ్య కోరారు.

## విద్యార్థి మిత్ర కిట్ల భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన... స్టేట్ అబ్జర్వర్ ...



**కృత్తివెన్ను,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా కిట్లను భద్రపరుచుటకు ఏర్పాటుచేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంగమూడి నందు ఏర్పాటుచేసిన గదులను స్టేట్ అబ్జర్వర్ మహేశ్వర్ రెడ్డి మరియు కృష్ణాజిల్లా సీఎంఓ అయిన రమేష్ వచ్చి పరిశీలించడం జరిగింది. ఎంఈఓ ఎస్ కే డి వి ప్రసాద్ రావు మరియు పాఠశాల పిడి గోవర్ధన్ కంప్యూటర్ ఆపరేటర్ సుబ్రహ్మణ్యం, సిఆర్ఎంటి సోమశేఖర్ దగ్గరుండి వారికి స్టాక్ పాయింట్ ను చూపించడం జరిగింది.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీపీ దేవినేని




**కంకిపాడు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** మండలంలోని ఈడుపుగల్లు గోసాల సెంటర్ నందు రావుఫ్ బైక్ మెకానిక్స్ షేక్ రావుఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎంపీపీ దేవినేని రాజా శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవినేని రాజా మాట్లాడుతూ వ్యాసభలో ఉష్ణోగ్రత త్రైవర్త ఎక్కువగా ఉండటం వలన ప్రయాణికులకు, బాటసారిలకు దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమ న్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ షకార్, షేక్ సుభాని, రవి కిషోర్, ఎన్ మాధవరావు, ఉదయ్ బాబు, ఎండి ఫిరోజ్, ఎన్ ఆంజనేయ దాసు, దాసరి హనుమంతరావు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అన్నేని సన్మానించిన మైనార్టీ నాయకులు



**కంకిపాడు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పోస్టులు ఉప్పులూరు గ్రామానికి చెందిన అన్నే ధనయకు కంకిపాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ఎంపిక కావడంతో మండలంలోని ముస్లిం మైనార్టీ నాయకులు ధనయ్యను శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ధనయ్య మాట్లాడుతూ మైనార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలియచేసి, రైతుల మరియు ముస్లింల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సలీం భాయ్, సాంబయ్య, బాజీ, షేక్ మోదీన్, టిడిపి నాయకులు కొండవీటి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సుతోనే పోటి ప్రపంచములో రాణింపు




**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ప్రస్తుత ప్రపంచం ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్ మీద నడుస్తుందని దానికి అనుగుణంగా నేటితరం విద్యార్థిని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోవాలని మరియు క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజేస్ అన్నీ నేర్చుకున్న వారికి ప్రస్తుత పోటీ ప్రపంచములో అనేక అవకాశాలు ఉన్నాయని స్థానిక అక్కినేని నాగేశ్వర రావు కళాశాలలో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్ మెంట్ సెల్ మరియు ఎం.సి.ఎ. డిపార్టుమెంటు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కృతిమ మేదస్సు సదస్సుకు అతిధి ఉపన్యాసకులుగా విచ్చేసిన ఎ.కె. టెక్నాలజీస్, హైదరాబాద్ కార్పోరేట్ ట్రైనర్ వేదాంతం విరించి తెలియజేసారు. ఈ సందర్భముగా ఆయన విద్యార్థిని, విద్యార్థులతో కృత్రిమ మేధస్సు ప్రయోగాలూ చేపించారు. ఈ కార్యక్రమములో పి.జి. విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్, కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ ఎల్.ఆర్.కె. ప్రసాద్, కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.ఎస్. అప్పారావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఎం.సి.ఎ. విభాగాధిపతి సి.హెచ్. మల్లిక మరియు ఎం.సి.ఎ. అధ్యాపకులు, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్ మెంట్ సెల్ విభాధిపతి వి.నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడులో త్రివిధ జూనియర్ కళాశాల ప్రారంభం



**నూజివీడు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** నూజివీడులో ఈ ఏడాది విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ విద్యను అందించేందుకు త్రివిధ జూనియర్ కళాశాలను స్థాపించనున్నట్లు త్రివిధ విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్ తెలిపారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా త్రివిధ పాఠశాలను ఆదరించినట్లుగానే, జూనియర్ కళాశాలలో కూడా ఆదరించి, ఆశీర్వదించాలని కోరారు. ఎంపీసీ విభాగంలో మొదటి సంవత్సరం అడ్మిషన్లను శుక్రవారం నుండి ప్రారంభించనున్నామన్నారు. ఆధునిక సాంకేతిక విద్యను అది తక్కువ ఖర్చుతో అన్ని వర్గాల వారికి అందించేందుకు జూనియర్ కళాశాలలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విద్యాబోధనలో అర్హత, నైపుణ్యం ఆధారంగా ఉపాధ్యాయులచే విద్యను అందించేందుకు త్రివిధ కళాశాల ముందుకు వెళుతుందని అధ్యాపకుడు నాగమల్లేశ్వరరావు తెలిపారు. అనంతరం త్రివిధ పాఠశాల పూర్వ విద్యార్థి సూర్యవర్ధన్ మాట్లాడుతూ ఖరగ్ పూర్ లో ఐఐటీ పూర్తి చేసి, తాను చదువుకున్న పాఠశాలలో ఉత్తమ, నాణ్యమైన విద్యను అందించేందుకు త్రివిధ కళాశాలలో పనిచేసేందుకు వచ్చినట్లు తెలిపారు. నూజివీడు పరిసర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించడానికి మా కళాశాల విద్యా బోధన ఉంటుందన్నారు. శుక్రవారం నుండి కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించారు.

## నూజివీడు మండలంలో నవోదయం 2.0 కార్యక్రమం



**నూజివీడు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** నూజివీడు ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఏలూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ బి శ్రీలత, ఏలూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ నాగ ప్రభు కుమార్, ఏలూరు జిల్లా డిస్టిక్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఆఫీసర్ అవులయ్య ఆదేశాల మేరకు నూజివీడు మండలం, సిధార్థ నగర్ తండా, ఒగిరలతండా లలో నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనముగా ప్రవేశ పెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమమును ఏలూరు జిల్లా అసిస్టెంట్ ఆఫ్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సి హెచ్ అజయ్ కుమార్ సింగ్ అద్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ కమిటీని ఏర్పాటు చేసి ఈ కమిటీ ద్వారా గ్రామంలో ఎవరైనా నాటు సారాయి తయారు చేసిన, అమ్మిన రవాణా చేసిన, వారి వివరాలు తెలియజేస్తామని, సిధార్థ నగర్ తండా, ఒగిరలతండాలను నాటు సారాయి రహిత తండాగా తీర్చిదిద్దడమే ఈ గ్రామ కమిటీ లక్ష్యమని నిర్ణయించినట్లుగా ఏలూరు జిల్లా అసిస్టెంట్ ఆఫ్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సి హెచ్ అజయ్ కుమార్ సింగ్ తెలిపినారు. అనంతరం గ్రామంలో నాటు సారాయి రహిత ప్రచార రథం ద్వారా గ్రామంలో ప్రచారం చేయడం జరిగింది. అనంతరం దాడులు చెయ్యగా 8 లీటర్ల నాటు సారాయి ని స్వాదినపరచుకొని, 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఈ నేరమునకు సంబందించిన సిధార్థ నగర్ కు చెందిన బానవతు పంగిడమ్మ, భర్త అర్జున పై కేసు నమోదు చేసినట్లు ఏలూరు జిల్లా అసిస్టెంట్ ఆఫ్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సి.హెచ్.అజయ్ కుమార్ సింగ్ తెలిపినారు.

## దర్శనానికి వచ్చిన భక్తులపై దాడికి పాల్పడుతున్న "సెల్ ఫోన్ కౌంటర్" ప్రైవేటు సెక్యూరిటీ.....



**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద రోజురోజుకీ పెరుగుతున్న అరాచకం.అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులకు సెల్ ఫోన్లు కౌంటర్ ఏర్పాటు చేసి ఉన్నారు, కొంతమంది వ్యక్తులు తెలియక "సెల్ ఫోన్" ఆలయంలోకి అలానే తీసుకు వెళ్తూ ఉంటారు. అక్కడ ఉన్న ప్రైవేటు సెక్యూరిటీ వారి వద్దనున్న సెల్ ఫోన్ కౌంటర్ వద్ద ఉంచమని చెప్పటం వాళ్ళ ఉద్యోగ ధర్మం.అలా కాకుండా భక్తులపై తిరగబడే వైనం పెనుగంచిప్రోల్ లో చోటు చేసుకుంది. ఇది తప్పు అని తెలియ పరిచిన "మీడియా" వారని కూడా తేలిగ్గా తీసివేసి మీరేం చేసుకుంటారో చేసుకోండి. వార్త వేస్తే వేసుకోండి. లేదంటే ఈవోతో చెప్పుకోండి. అంటూ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. పైగా మీలాగా నేను కూడా విలేకరినే అయితే ఏంటి..? నా బలం మీకు తెలుసా..? అంటూ సాటి మీడియా నే ప్రశ్నించాడు. విషయాన్ని ఆలయ ఈవో దృష్టికి తీసుకువెళ్లగా పిలిచి సెల్ ఫోన్ కౌంటర్ పటాదారుని మందలించడం జరిగినది. పవిత్ర పుణ్య దంపతుల క్షేత్రమైన శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఇంకా వెలుగు చూడవలసిన అరాచకాలు ఎన్నో... మరెన్నో ఉన్నాయి..అమ్మ వారి ఆశీస్సులతో ఒక్కొక్కటిగా బయటికి వస్తాయనీ భక్తులు చెప్పుకుంటూన్నరు.

## నూజివీడు డిపోలో నూతన బస్సు సర్వీసులు ప్రారంభం



**నూజివీడు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** నూజివీడు ఆర్టీసీ డిపోలో నూతన బస్ సర్వీస్ లను ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సూపర్ లక్సరీ పుష్బాక్ సీట్స్ కలిగిన 2 బస్సులు, ఈ బస్సులు రోజు నూజివీడు నుండి రాత్రి 7:30 గంటలకు బయలుదేరి తిరుపతి కి బయలుదేరి వెళ్ళగా, డౌన్ లో మరుసటిరోజు సాయంత్రం 6:10 నిముషాలకు బయలుదేరి నూజివీడు వస్తుంది. నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ G. రాంబాబు, హయ్యర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ p. రామకృష్ణ, హైర్ బస్ ఓనర్ పుట్టి శరత్ బాబు, నూజివీడు డిపో స్టాఫ్, యూనియన్ అసోసియేషన్స్ ఈకార్యక్రమంలో పాల్గొనుట జరిగినది. ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానంకు మన డిపో నుండి బస్సులు నడుపుట సంతోషంగా ఉందని జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తెలిపారు.

## ఏపీ అన్ రికగ్నైజ్డ్ వర్కర్స్,ఎంప్లాయిస్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వంటెద్దు బాబి



**అమలాపురం,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) అనుబంధ సంస్థ.. ఆంధ్రప్రదేశ్ అన్ రికగ్నైజ్డ్ వర్కర్స్ ,ఎంప్లాయిస్ కాంగ్రెస్ (కెకెసి) రాష్ట్ర అధికార ప్రతినిధి గా అమలాపురంకి చెందిన వంటెద్దు బాబి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి.కెకెసి స్టేట్ చైర్మన్ కాలేపు వెంకట కృష్ణారెడ్డి నియమించిన ఆరుగురు సభ్యులుగా ఉన్న రాష్ట్ర కమిటీలో డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి వంటెద్దు బాబి కెసిసి అధికార ప్రతినిధి గా నియమించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులుగా గుర్తింపు ఉన్న బాబీ ప్రస్తుతం అమలాపురం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గా పని చేస్తున్నారు.బాబిని అధికార ప్రతినిధిగా నియమించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బాబి పిసిసి అధ్యక్షులు వైఎస్. షర్మిల, ఏఐసీసీ ఆహ్వాన కమిటీ సభ్యులు గిడుగు రుద్రరాజు,కెకెసి స్టేట్ చైర్మన్ కె వెంకటకృష్ణారెడ్డి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కొడేటి చిట్టిబాబు, పీసీసీ ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్, జిల్లా ఇంఛార్జి జగత శ్రీనివాసరావు, మాజీ పార్లమెంట్ ఇంఛార్జి మట్టా ప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూ లు



**ఆగిరిపల్లి, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన ఆగిరిపల్లి లో కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూ లు మండల పర్షిత్ కార్యాలయం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆరు బ్యాంకుల ప్రతినిధు లు హాజరైనారు. బీ సి మరియు ఈ బి సి రుణాల ఇంటర్వ్యూలను బి సి కార్పొరేషన్ ఎగ్జిక్యూట్ డైరెక్టర్ మరియు బి సి కార్పొరేషన్ సంక్షేమ అధికారి పరిశీలించారు. ఈ కార్పొరేషన్ రుణాల దరఖాస్తులు మొత్తం 732 మంది కాగా 566 మంది హాజరైనట్లు ఎం పి డి వో తెలిపారు.

## అమెరికా సుంకాలకు మోదీ ట్రంప్ కార్డ్

● భారత ఫార్మా ఉత్పత్తులకు ట్యాక్స్ మినహాయింపు

● ప్రధాని చొరవకు ధన్యవాదాలు: డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**విజయవాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల పెంచిన సుంకాలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ ట్రంప్ కార్డ్ వేసారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎస్సార్సీ ల్యాబొరేటరీస్ అధినేత డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. అమెరికా ప్రతీకార సుంకాల నుంచి భారత ఫార్మా ఉత్పత్తులకు మినహాయింపు ఇవ్వడం ప్రధాని నరేంద్ర మోదీ పనితీరుకు నిదర్శనమని చెప్పారు. విదేశీ ఉత్పత్తులపై ఇటీవల భారీగా సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్,మొత్తం 60 దేశాల కంపెనీలపై సుంకాలు విధించారు. మన దేశం ఎగుమతి చేస్తున్న 90 శాతం జనరిక్ ఔషధాలపై కూడా 27 శాతం టారిఫ్ విధించారు. అయితే రెండు రోజులు గడవక ముందే జనరిక్ మందుల తయారీలో భారత్ గొప్పతనాన్ని గుర్తించి, డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని సుంకాలు విధించే నిర్ణయం వెనక్కి తీసుకున్నారని ఎస్సార్సీ ల్యాబొరేటరీస్ అధినేత డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. ఇదంతా జనరిక్ ఔషధాల తయారీకి మోదీ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహమే అన్నారు. భారత్ పై సుంకాలు విధిస్తే, లక్షలాది మంది అమెరికన్ల మెడికల్ బిల్లులు పెరిగే అవకాశం ఉందని గ్రహించారని చెప్పారు. అమెరికన్ వైద్యులు సూచించే ప్రతి 10 జనరిక్ ఔషధాల్లో 9 భారత్ నుంచే అమెరికాకు దిగుమతి అవుతున్నా యని, అందువల్ల ఆ నిర్ణయం వెనక్కి తీసుకోవడం మినహా అమెరికాకు మరో ప్రత్యామ్నాయం లేదన్నారు. మరోవైపు అమెరికాలో జనరిక్ ఔషధాలపై సుంకాలు విధించకపోవడం వల్ల భారత్ లో ఫార్మా రంగానికి ఊరట లభిస్తుందని చెప్పారు. ఒక శాస్త్రవేత్తగా, ఫార్మా రంగానికి చెందిన పారిశ్రామికవేత్తగా ప్రధాని మోదీ తీసుకున్న చొరవకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎస్సార్సీ ల్యాబొరేటరీస్ అధినేత డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి చెప్పారు. ఈ నిర్ణయంతో భారత్ నుంచి ఫార్మా ఎగుతులు ఘననీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు.. అదేక్రమంలో అమెరికా ఎగుమతులు కూడా పెరుగుతాయని చెప్పారు. మోదీ చొరవ కారణంగా రెండు దేశాల మధ్య సమతుల వాణిజ్య సంబంధాలు ఏర్పడిందని.. ప్రస్తుతం అమెరికాలో నెలకొన్న అనిశ్చితి కూడా తొలగే అవకాశం లేకపోలేదని.. ఇది పరోక్షంగానూ అమెరికాలో నివసిస్తున్న భారతీయులు ఊరట కలిగిస్తుందని డాక్టర్ ఏలూరి అభిప్రాయపడ్డారు.

## బాపులపాడుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకుస్టూడెంట్ కిట్ పంపిణీ




**హనుమాన్ జంక్షన్, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** వేసవి సెలవులు సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని బాపులపాడుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి వి నాగేశ్వరరావు అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (SRKVM) స్టూడెంట్ కిట్ లో భాగంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు పంపిణి చేసారు. ప్రతివిద్యార్థికి 6 తెలుపు, 6 రూల్ పుస్తకాలు పంపిణీ చేశారు. హైస్కూల్ ప్లస్ విద్యార్దులకు ఏప్రిల్ 1 నుంచి తరగతులు ప్రారంభం అయ్యాయని, మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని, 7వ తేదీ తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. పదవతరగతి పరీక్షలు వ్రాసిన బాలికలు సదావకాశం వినయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు ఎం జయరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వైసీపీ నేత సుధాకర్ ను కలిసిన ఎస్ సి సెల్ రాష్ట్ర కార్యదర్శి శామ్యూల్..



**పెనుగంచిప్రోలు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** తాడేపల్లి వైఎస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సంతనూతలపాడు మాజీ శాసనసభ్యులు టీ.జే.ఆర్. సుధాకర్ బాబుని మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర వైఎస్సార్సీపీ ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి శ్యాముల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట పట్టణ ప్రచార కమిటీవిభాగ అధ్యక్షులు గోగుల వెంకయ్య,పట్టణ కార్మిక విభాగ అధ్యక్షులు గంగోలు వినోద్ కుమార్, వైసీపీ యువ నాయకులు శీలం మంగారావు,దార్ల ప్రసన్న కుమార్, ర్లు సుధాకర్ బాబు ని ఘనంగా సత్కరించడం జరిగింది.

## గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా చాట్రగడ్డ రవికుమార్ నియామకం..



**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకమైన మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్గా నందివాడ మండల టిడిపి నాయకులు చాట్రగడ్డ రవికుమార్ నియమితులయ్యారు. గతంలో నందివాడ మండల వైస్ ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించిన రవికుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్గా నియమితులయ్యారు.

# ధ్యాన సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం

● సహజ యోగ ధ్యాన కేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ కల్లూరి రామకృష్ణ







**విజయవాడ/జి.కొండూరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** సహజయోగ ధ్యానాన్ని ప్రతిరోజూ ఆచరించటం కుండలినీ జాగృతి అవ్వడంతో ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందొచ్చునని సహజ యోగ ధ్యాన కేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ కల్లూరి రామకృష్ణ అన్నారు. హెచ్‌హెచ్ శ్రీ మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 4నుంచి 10వ తేదీ వరకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో జరగనున్న సహజయోగ చైతన్య ప్రచార రథ యాత్ర తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్, కోదాడ, హుజూర్‌నగర్, మఠంపల్లి నుంచి జగ్గయ్యపేట వద్ద ఎన్టీఆర్ జిల్లాలో శుక్రవారం ప్రవేశించింది. ఉదయం 6 గంటలకు కంచికచర్ల మీదుగా మూలపాడు చేరుకుంది. 11.30 గంటలవరకూ గ్రామంలో పెద్దఎత్తున ప్రచార కార్యక్రమం జరిగింది.అనంతరం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడికి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంది.గొల్లపూడి ఒన్‌సెంటరులో సహజయోగులు ఘన స్వాగతం పలికారు. సహజయోగ ట్రస్ట్ మహిళా విభాగం కోఆర్డినేటర్ సుగ్గల సుధారాణి, ఎన్ఎస్‌పిటీ దక్షిణాది రాష్ట్రాలు (ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు, కేరళ) కన్వీనర్ కె.సుభాషిణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టినేని వెంకట్రావు, ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ ఎస్.శంకర్, కోకన్వీనర్ డి.జయశంకర్, విజయవాడ నగర కోఆర్డినేటర్ టి.రవీంద్రబాబు బృందంలో ఉన్నారు. మధుసూదనరావు, రమాదేవి, అరుణ, కల్పన, విజయ, డి.వెంకటేశ్వర్లు, శిద్దిరెడ్డి ప్రసాద్ (పాలకొల్లు), రాఘవరావు (కాకినాడ), వైశాలి, టి.లక్ష్మి, సరస్వతి, పావని, సౌజన్య, రాజీ, వై.లక్ష్మి, నాగశిరోమణి తదితరులు బృందం స్వాగతం పలికింది.గొల్లపూడి పరిసర ప్రాంతాల్లో పర్యటించిన రథయాత్ర బృందానికి విశేష స్వాగతం లభించింది. ధ్యాన కేంద్రం ఉన్న స్టాలికెట్ స్కూలు వద్ద పెద్దఎత్తున హారతులు ఇచ్చి యాత్ర బృందానికి ఘనస్వాగతం పలికారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు కరెన్సీనగర్ లో యాత్ర జరిగింది. అడపా రామ్మోహనరావు నేతృత్వంలోని బృందం ఆయా ప్రాంతాల్లో రథయాత్ర రాత్రి 7 గంటల వరకూ కొనసాగింది. సహజయోగ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. సహజయోగం విశ్వనిర్మలధర్మం విశ్వ నిర్మల ధర్మ ప్రస్థాపన శ్రీ మాతాజీ నిర్మల దేవి విశ్వమంతా ఒకే ధర్మం స్థాపించాబడాలనే కృతనిశ్చయంతో 1970 మే 5న సహజయోగ ధ్యానాన్ని ప్రవేశపెట్టారని కల్లూరి రామకృష్ణ అన్నారు.సహజయోగ స్థాపకురాలు పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవేశపెట్టిన నిరంతరం సహజయోగ సాధన ద్వారా మనిషి శారీరక, మానసిక రుగ్మతలను మాయం చేసుకోవచ్చు అని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రచార రథయాత్ర కన్వీనర్ ఎస్.శంకర్, విజయవాడ నగర కోఆర్డినేటర్ టి.రవీంద్రబాబు మాట్లాడుతూ హెచ్‌హెచ్ శ్రీ మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 4నుంచి 10వ తేదీ వరకూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో సహజయోగ చైతన్య ప్రచార రథం పర్యటించనున్నదన్నారు. 5,6 తేదీల్లో ఉయ్యూరులో జరిగే యాత్రను జయప్రదం చేయాల్సిందిగా కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టినేని వెంకట్రావు, కృష్ణా, ఏలూరు, భీమవరం జిల్లా కోఆర్డినేటర్లు నున్న లక్ష్మీప్రసన్న, కాకి వెంకటలక్ష్మి, సిహెచ్ మణి మాట్లాడుతూ సహజయోగ పక్రియల్లో ధ్యానం చేయటం ద్వారా ప్రతి ఒక్కరూ తమలో వివేకం, విజ్ఞానం, సత్యగుణాలను పెంపొందించుకోవచ్చునన్నారు. శారీరక, మానసిక ఉన్నతిని పొందొచ్చునని వివరించారు. సహజయోగులోని కుండలినీ చైతన్య తరంగాలను అన్ని పార్శ్వాలకు ప్రసరిస్తున్నపుడు క్రమంగా ఈ నాడులన్నీ చైతన్యవంతమవుతాయన్నారు.కుండలినీ శక్తి సత్యాన్ని అనుభూతివరంగా మానవాళికి సునాయాసంగా ఆమె అందించారన్నారు. ప్రతిరోజూ ఉదయం సాయంత్రం ధ్యానం చేయటంతో మనలోని ఇడా, పింగళ, సుషుమ్నా నాడులు చైతన్యవంతమవుతాయన్నారు. సాధకునికి శారీరక, మానసిక, ఉద్రేకజనిత, ఆధ్యాత్మిక సమస్యల నుండి విముక్తి లభించి, సత్ చిత్ ఆనందం లభిస్తుందన్నారు. నాడుల్లోను, చక్రాల్లోను (మూలాధార, స్వాధిష్ఠాన,మణిపూర, అనాహత, విశుద్ధి, ఆజ్ఞా, సహస్రార) చక్రాల్లో భగవంతుని శక్తిని నింపుకుని, శారీరక, మానసిక, భావావేశ్య, ఆధ్యాత్మిక ఉన్నతి పొందొచ్చునని వివరించారు. సహజయోగ ట్రస్ట్ సలహాదారు ఎం.వి.ఎల్.గోపీరత్నం, ఎం.సాంబశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వి.రామ్మోహనరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ వంతం గిరిజాదేవి,సుగ్గల శ్రీనివాసరావు, ఉయ్యూరు ప్రతినిధులు ఆకుల దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు లు సహకరించారు.

**యాత్ర సాగేదిలా:** సాయంత్రం విజయవాడ నగరంలోని కరెన్సీనగర్‌లో యాత్ర బృందం పర్యటించింది. అనంతరం రథయాత్ర ఉయ్యూరు బయలుదేరి వెళ్లింది. శని, ఆదివారాల్లో ఉయ్యూరు నగరంలో పర్యటించనుంది. అక్కడి ఎజి అండ్ ఎజిఎస్ కళాశాలలో రియలైజేషన్ కార్యక్రమం రెండు రోజులపాటు జరగనుంది. ఉయ్యూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో రథయాత్ర బృందం పర్యటించనుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ ఆరునెలలపాటు ఈ రథయాత్ర జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 150 దేశాల్లో సహజయోగాన్ని ప్రజలు ఆచరిస్తున్నారు.

# నాగేశ్వరరావు పేటలో నాలుగురోజులు ధార్మిక కార్యక్రమాలు



**పెడన,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్వగ్రామమైన బంటుమిల్లి మండలం నాగేశ్వరరావు పేటలో ఈ నెల 8 వతేదీ నుంచి 11 వతేదీ వరకు 4 రోజుల పాటు ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం తితిదే ధర్మప్రచార పరిషత్ కరపత్రాలను పెడన దేవాంగుల కళ్యాణ మంటపం లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆవిష్కరించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు తన తండ్రి కాగిత వెంకట్రావు తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ గా ఉన్న సమయంలో నాగేశ్వరరావు పేటలో తిరుమల తిరుపతి దేవస్థానం పక్షాన పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయన్నారు. మళ్ళీ చాలా కాలం తర్వాత ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు ఈ నాలుగు రోజుల పాటు ఆధ్యాత్మిక వేత్తలతో ధార్మిక ఉపన్యాసాలు భజనలు కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. తితిదే ధర్మప్రచార పరిషత్ ధర్మాచారిణి జొన్నలగడ్డ మాధవి ఫణి శాస్త్రి ఉపన్యాసాలు ఏర్పాటు చేసారన్నారు. చివరిరోజు 11 వతేదీ ఉదయం 10 గంటలకు వంద మంది ముత్తైదువులతో సామూహిక కుంకుమ ర్చన నిర్వహిస్తామన్నారు. ఈ కుంకుమార్చన లో పాల్గొన్న మహిళల కు తిరుమల తిరుపతి దేవస్థానం వారు పంపిన అమ్మ వారి రూపు బహూకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. సమాజంలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు, [illegible] దివ్య తత్వం ప్రజలకు మరో సారి తెలిపేందుకు తితిదే ధర్మ ప్రచార పరిషత్ ఈ కార్యక్రమాలు చేపట్టిందన్నారు ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ ప్రతినిధి తరగా శ్రీ ప్రసాద్ తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మాచారిణి జొన్నలగడ్డ మాధవి పెడన మునిసిపల్ కమిషనర్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# కలంకారీ పరిశ్రమకు అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పించటమే లక్ష్యం - ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్

**పెడన,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** కలంకారీ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా కలంకారీ పరిశ్రమకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కల్పించడం లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్ళాలని కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. కలంకారీ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఎమ్ ఎస్ ఎమ్ ఇ సమావేశం స్థానిక దేవాంగ కళ్యాణ మండపం లో క్లస్టర్ డెవలప్ మెంట్ అధ్యక్షులు బళ్ల ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కలంకారీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వత పరిష్కారంతో పాటు కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అలాగే కలంకారీ క్లస్టర్ కు అవసరమైన స్థలములను భవనాలను గుర్తించి వాటి అనుమతుల కోసం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని కలెక్టర్ కూడా క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం అమలు చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని అన్నారు క్లస్టర్ సభ్యులు జైపూర్ ఇండస్ట్రియల్ టూర్ లో అక్కడ జరుగుచున్న ప్రక్రియా లను పరిశీలించి మన కలంకారీ ప్రక్రియ కి వాటికి మధ్య ఉన్న యాంత్రీకరణ పద్ధతులను మన పరిశ్రమలలో కూడా అమలు చేస్తే ఎలా ఉంటుందో బేరీజు వేసుకుని పరిశ్రమ మేలు చేసుకోవాలని కోరారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ ద్వారా కలంకారీ పరిశ్రమకు అవసరమైన జాజి ఆకును ఇతర సాంప్రదాయ వస్తువులను క్లస్టర్ కి మాత్రమే అమ్మే విధానంగా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సూక్ష్మ,చిన్న మధ్యతరహా పరిశ్రమలకు అభివృద్ధికి అనేక ప్రోత్సాహకాలను మరియు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నాయి వాటిని ఉపయోగించుకోవడం ద్వారా అటు పరిశ్రమని అభివృద్ధి చేసుకోవడం తో పాటు కార్మికుల సంక్షేమానికి ఎంతో ఉపయోగమని అన్నారు క్లస్టర్ సభ్యులు పర్యటించిన ఇండస్ట్రియల్ టూర్ లో అనేక విషయాలను పరిశీలించి పరిశ్రమ అభివృద్ధికి.రాబోవు యువతరానికి ఈ టూర్ ఎంతో దోహదపడుతుంది పక్కనే ఉన్న ఇమిటేషన్ జ్యూలరీ పార్క్ మీకు మార్గదర్శకమని అన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలంకారీ పరిశ్రమ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు గౌరవ కలెక్టర్ బాలాజీ చూపుతున్న చొరవ కలంకారీ పరిశ్రమ కి మంచి రోజులు రాబోతున్నాయని అన్నారు. గతంలో కలంకారీ క్లస్టర్ కోసం గతంలో చేసిన ప్రయత్నం ఎందుకు విఫలమైంది. ఆ ప్రయత్నంలో ఉన్న లోపాలను అధికమించి కలంకారి క్లస్టర్ డెవలప్మెంట్ కోసం కృషి చేస్తే పరిశ్రమలో ఉన్న దాదాపు 10వేల మందికి ఉపయోగపడుతుందని వేణుగోపాలరావు అన్నారు క్లస్టర్ సభ్యులు పర్యటించిన జైపూర్ పరిసర ప్రాంతాల్లో అక్కడ ఉన్న మార్కెటింగ్ కి కలంకారీ పరిశ్రమ మార్కెటింగ్ కి ధరలో ఎందుకు వ్యత్యాసం ఉంది. రా మెటీరియల్స్ బ్యాంకు ద్వారా అతి తక్కువ ధరలకు క్లస్టర్ ద్వారా అందించి ఉత్పత్తి వ్యయం తగ్గించి అధిక లాభాలను పొందడానికి క్లస్టర్ ఉపయోగపడుతుంది అని అన్నారు వేసవిలో నీళ్ళతీత ప్రక్రియ లో ఉన్న నీటి కొరత సమస్యను అధికమించడానికి ఎమ్మెల్యే తో పాటు ఇతర ప్రజాప్రతినిధుల సాయం తీసుకుంటామని అన్నారు. ముందుగా ఇటీవల జైపూర్ పరిసర ప్రాంతాలలో క్లస్టర్ ప్రోగ్రామ్ సభ్యులు పర్యటించిన వివరాలను వీడియో రూపంలో ప్రదర్శిస్తూ పూర్తి వివరాలను సభకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య జువెలరీ పార్క్ అధ్యక్షులు వి వెంకట సుబ్బారావు కట్టా హేమసుందరమూర్తి ఊటుకూరి శ్రీగిరి కట్టా మునేశ్వరరావు డిజైనర్ అశ్వినీ కుమార్ టెక్స్ టైల్స్ డిజైనర్ ఖుష్ కుమార్ కలంకారీ క్లస్టర్ ప్రధాన కార్యదర్శి జంపాన దీక్షా శ్రీనివాస్ తదితర సభ్యులు పాల్గొన్నారు

# కధ ముగిసినా... కనుమరుగు కాలేదు !




**మోపిదేవి/అవనిగడ్డ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం కొలువుదీరి తొమ్మిది నెలలు గడుస్తున్నా కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామ పంచాయతీలో పాత వాసనలు పోలేదు.సాధారణంగా నూతన ప్రభుత్వం ఏర్పాటు అయినప్పుడు ఆ ప్రభుత్వాధినేతల హామీలు, మ్యానిఫెస్టోలో అంశాలు పధకాలుగా ప్రచారాంశాలవటం ఆనవాయితీ.కానీ మోపిదేవి మండలం పెదప్రోలు మేజర్ పంచాయతీలో మాత్రం ఇందుకు భిన్నంగా రద్దైన పధకాలకు ఇంకా ప్రముఖంగా ప్రచారం కొనసాగుతోంది.గత వైకాపా ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలతో పాటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి చిత్రంతో ప్రదర్శించడం విమర్శలకు తావిస్తుంది. అధికారులు నిర్లక్ష్యం వహించినా కూటమి కి చెందిన సర్పంచ్ కూడా దీనిపై దృష్టి సారించకపోవడం గమనార్హం.

# నూజివీడు కృష్ణ యూనివర్సిటీలో నిరసన కార్యక్రమం

● హెచ్ సి యు విద్యార్థులపై తెలంగాణ పోలీసులు చేసిన దాడిని ఖండించండి



**నూజివీడు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నందు గత వారం రోజుల నుంచి విద్యార్థులు, అక్కడున్నటువంటి విద్యార్థి సంఘాలు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా ఐసా ఆధ్వర్యంలో ఈరోజు ఆంధ్రప్రదేశ్ నందు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమం పిలుపులో భాగంగా శుక్రవారం నూజివీడు కృష్ణ యూనివర్సిటీ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఐసా జిల్లా కార్యదర్శి అఖిల్ మాట్లాడుతూ ఏదైతే తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని అక్రమంగా ప్రవేట్ కార్పరేట్ వ్యక్తులకు లాభపరిచే విధంగా ప్రభుత్వం చేయడాన్నీ వ్యతిరేకిస్తూ తక్షణమే విద్యార్థులు చేస్తున్న ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీ భూమిని యూనివర్సిటీకి చెందే విధంగా చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. లేనిపక్షంలో మరింత ఈ ఉద్యమాన్ని అన్ని ప్రాంతాల్లో విస్తరింపజేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసా నాయకులు రియాజ్, శీను, గణేష్, రాజేశ్వరి, సౌజన్య, చంద్రలేఖ తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల్లోనే రైతుల ఖాతాలకు డబ్బులు జమ

● రైతు నుండి ప్రతి బస్తా కొనుగోలు చేయడం జరుగుతుంది ● రైతుల సంతోషమే కూటమి ప్రభుత్వము ముఖ్య ఉద్దేశ్యం ● రైతులకు గిట్టుబాటు ధర కల్పించాం: :రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



**వెంకటగిరి, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులు పండించిన ప్రతి బస్తాను ప్రభుత్వము కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.శుక్రవారం సాయంత్రం వెంకటగిరి మండలం యాతలూరు గ్రామము నందు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,రైల్వే కోడూరు ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ శ్రీధర్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, గ్రామ సర్పంచ్ పెంచాలమ్మ ల తో కలసి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రైతు సేవ కేం ద్రం ద్వారా ధాన్యము కొనుగోలు రబీ సీజన్ 2024 - 25 సంవత్స రానికి సంబంధించి రైతులతో నిర్వహించిన ముఖా ముఖి కార్యక్ర మంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటుగా ప్రతి బస్తాను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలలోనే 7 వేల మంది రైతుల నుంచి 74 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి 154 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు సంతోషంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లాలో 134 రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం రైతులకు బకాయిలు చెల్లించకుండా పెండింగ్ పెట్టిన 1674 కోట్ల రూపాయల బకాయిలను కూటమి ప్రభుత్వం రైతులకు చెల్లించడం జరిగింది అన్నారు. రైతుల అనుభవాలను, వారి కష్టాలను తెలుసుకొనడానికి యాతలూరు గ్రామానికి రావడం జరిగిందన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వాట్సప్ ద్వారా రైతుల ధాన్యమును కొనుగోలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీని తీసుకొచ్చిందని, రైతులకు నచ్చిన రైసుమిల్లులకు ధాన్యమును వారు అమ్ముకోవచ్చునని రైతులకు సూచించారు. రైతుల నుండి ధాన్యము కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతులకు డబ్బు చెల్లించడం జరుగుతుందని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అయితే 24 గంటల్లోనే 90 శాతం మంది రైతులకు జమవుతుందని తెలిపారు. రైతు నుంచి ప్రతి బస్తాని కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. 17 శాతం తేమ ఉన్ననూ ధాన్యంను కొనుగోలు చేయాలని మిల్లర్ల కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. గోతాల కొరత వల్ల ఏ రైతు ఇబ్బందులు పడకూడదని ఉద్దేశంతో జిల్లా కు ఐదు లక్షల గోతాలను అందజేయడం జరిగిందన్నారు. రైతుల ఆవేదనను అధికారులు అర్థం చేసుకోవాలన్నారు. అధికారులు కార్యాలయాల్లో కూర్చోకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సాధక బాధలు తెలుసుకొని రైతులకు ధైర్యం నూరిపోయాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు చూడాలన్నారు. పండించిన ధాన్యాన్ని ఎప్పుడు తీసుకొచ్చినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులకు కావలసిన ఎరువులు విత్తనాలు సకాలంలో అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రం లో అమ్మగానే రైతులకు మీరు అమ్మినట్లుగా, మీకు డబ్బులు పడిందని, మీరు సంతోషంగా ఉన్నారా అని మీ ఫోన్ కు మెసేజ్ లు వస్తున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు వస్తున్నాయని, గతంలో రైతులు మిల్లర్ల వద్ద నాలుగైదు రోజులు పడిగాపులు కాచే వారమని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు గంటల లోపల మిల్లర్లకు అప్పజెప్పి రైతులు సంతోషంగా వస్తున్నారని రైతులు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిఓ లక్ష్మి, డిఎం సివిల్ సప్లైస్ సుమతీ,మండల తహాశీల్దార్, ఎంపిడిఓ మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీల నేతలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల నిర్మాణాల్లో కోట్లు దోచుకున్న ఏ ఒక్కరిని వదిలిపెట్టం

(మొదటిపేజీ తరువాయి)

మంచిదని, లేకుంటే వారి ఆస్తుల నుంచ్కెనా రికవరీ చేసి నిరుపేదల ఇల్లు పూర్తి చేస్తామని చెప్పారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఎస్సీలు, బీసీలకు 50,000, ఎస్టిలకు 75000 అదనపు సహాయాన్ని మంజూరు చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఇళ్ల నిర్మాణాలు అర్హత ఉన్న పేదలందరికీ నిర్మించి ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి పేర్కొన్నారు. ఈ మార్చి నుంచి నూతన ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 1.50 లక్షల రూపాయలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు మొత్తం రూ. 2.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా అందజేస్తామని చెప్పారు. డ్వాక్రా మహిళా సంఘాలకు అదనంగా రుణ సౌకర్యం కూడా కల్పిస్తామని చెప్పారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఇప్పటికే పెద్దఎత్తున సామాజిక పింఛన్లు, అన్నక్యాంటీన్ ద్వారా పేదలకు ఆహారం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్న మంత్రి, మే, జూన్ నెలల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు మన బిడ్డల భవిష్యత్ గురించి ఆలోచన చేస్తూ చదువున్న ప్రతిఒక్కరికీ ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

**గృహనిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించే వరకు పోరాటం ఆగదు : సోమిరెడ్డి**

సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇల్లు నిర్మించకుండానే అమాయకులైన గిరిజనుల నుంచి వేలిముద్రలు వేసుకుని డబ్బులు దోచుకున్నారన్నారు. పదికాలాల పాటు పేదలు నివసించే ఇళ్లన నాసిరకంగా నిర్మించారని, బెస్‌మెంటును కూడా పిల్లర్లు లేకుండా, చాలా తక్కువ లోతులో నిర్మించారని, ఇలా ఇల్లు కడితే అది కూలిపోవడం ఖాయమన్నారు. ఈ ఇళ్ల నిర్మాణాలను చూస్తుంటే కడుపు మండిపోతుందన్నారు. గత ప్రభుత్వ పాలకులు మాత్రం కోట్లాది రూపాయల ఖరీద్కెన భవంతులు నిర్మించుకున్నారని, పేదలు నివసించే ఇళ్లను మాత్రం పట్టించుకోలేదన్నారు.

# దాతల సేవలు చిరస్మరణీయం

**కంకిపాడు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** దాతల సేవలు చిరస్మరణీయమని పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో కోలవెన్ను జిల్లా పరిషత్ పాఠశాల నందు శుక్రవారం పాఠశాల వ్యవస్థాపకులు అడుసుమిల్లి నాగయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దీనిలో భాగంగా ముందుగా బోడె ప్రసాద్,మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ రిబ్బన్ కట్ చేసి నాగయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సభలో పాల్గొన్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ చదువుకి,పాఠశాల స్థాపనకు కృషిచేసిన దాతల విగ్రహాలను ఆవిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. దాతలు చేసిన కృషి చరస్మరణీయమన్నారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని, ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగపరచుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహాలు కల్పించిన ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణశాతం పెరగటం లేదన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్



పాఠశాలలకు రికమండేషన్ లెటర్ ఏ విధంగా తీసుకువెళ్తున్నారు రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు కూడా రికమండేషన్ లెటర్లు తీసుకెళ్లే పరిస్థితి తీసుకొస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దీనిలో భాగంగానే కొలవెన్నె గ్రామానికి కోటి రూపాయలు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేశామన్నారు. రెండో విడత రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని



పేర్కొన్నారు. అనంతరం గత సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రైజ్ మనీ గోల్డ్ మెడలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిహెచ్ సురేష్, ఎంపీపీ నర్సు రాజ్యలక్ష్మి ,ఎంపీటీసీ తోకల ఉమాదేవి, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు తుమ్మల జగదీష్, టిడిపి నాయకులు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188